కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

బుధవారం 20, మే 2026 | 16 పేజీలు



# సరిహద్దు దాటిన దోపిడీలు...

రెక్కీలు చేస్తున్నా దొరకని సమాచారం....!

స్మార్ట్ ప్లాన్...ఓల్డ్ నెట్ వర్క్....?

రాష్ట్రాలు దాటి వెళ్లే వరకు పోలీసులకు అంతుచిక్కని వైనం...!

2లో



కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శాంతిభద్రతల రక్షణ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. పోలీసుల నిఘా వైఫల్యమా లేక నేరస్థుల తెలివితేటలా అన్నది పక్కన పెడితే, గత 15 ఏళ్లలో జరిగిన భారీ దోపిడీలు జిల్లా పోలీసు యంత్రాంగానికి పెద్ద సవాలు విసురుతున్నాయి. పగలు, రేయి అనే తేడా లేకుండా తుపాకులు గురిపెట్టి కిలోల కొద్దీ బంగారాన్ని ఎత్తుకెళ్తుంటే.. పోలీసులు మాత్రం చోరీ జరిగిన తర్వాత వచ్చే సీసీ టీవీ ఫుటేజీల వేటకే పరిమితమవుతున్నారనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

# మక్కరైతుల రక్తాన్ని పీల్చుక తాగుతున్నారు

20రోజులుగా మార్కెట్‌లో పడిగాపులు.. మార్క్‌ఫెడ్ కొనుగోళ్ల ముసుగులో.. స్థానిక దళారుల దందా..? వేలాది క్వింటాళ్లు ప్రైవేట్ గోదాంలకు మళ్లింపు..















# మొక్కజొన్న నిల్వకు ఐజీ గోదాం సిద్ధం

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**5వేల మెట్రిక్ టన్నుల సామర్థం ఏర్పాటు**



**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** మొక్కజొన్న నిల్వకు ఐజీ గోదాం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి మండలంలోని రంగాపూర్‌లో గల ధాన్యం గోదాములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదాములకు అదనంగా పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో గల ఐజీ గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రేపటి నుంచి పెద్దపల్లి జిల్లాలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి రంగాపూర్ ఐజీ గోదాంకు మొక్కజొన్న తరలింపు ప్రక్రియను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలని, అందుకు తగినట్లుగా గోదాముల వద్ద తగినంత మంది హమాలీలను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను అధికారులు అందరూ సమన్వయంతో నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అన్ని జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. గోదాముల వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్

**పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ ఎస్సై మల్లేశం**

**కారు, బంగారు గొలుసు స్వాధీనం**

**పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:**



దొంగతనం కేసులో అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్ చేసినట్లు పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ ఎస్సై మల్లేశం తెలిపారు. మంగళవారం పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన నిందితుడి అరెస్టుకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. ఉదయం ఎస్సై మల్లేశం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కూనారం రైల్వే గేట్ ప్రాంతంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. సరైన సమాధానాలు చెప్పకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా గతంలో చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. నిందితుడు నల్గొండ జిల్లా, పెద్ద అడిశర్ల మండలం, రంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఊరడి జనార్ధన్‌గా గుర్తించారు. అతడి నుండి రెడ్ కలర్ బలెనో కారు (నంబర్: టీఎస07ఎఫఎల1111), 20 గ్రాముల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ ఖర్చులకు సంపాదన సరిపోకపోవడంతో తన స్నేహితుడు పల్నాడు జిల్లా ముప్పాల మండలం మాదారం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేష్‌తో కలిసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. గతంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి సమయంలో చోరీలు చేసి దొంగిలించిన నగదు, బంగారాన్ని ఇద్దరూ పంచుకునేవారు. తర్వాత వెంకటేష్ అన్న తమ్మిశెట్టి మణికంఠ (వయసు 26) ను కూడా కలుపుకుని ముగ్గురూ కలిసి దొంగతనాలు కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. 2025 సెప్టెంబర్ నెలలో నల్గొండలో కారు అద్దెకు తీసుకుని వరంగల్, కరీంనగర్ మీదుగా పెద్దపల్లికి చేరుకుని, సుల్తానాబాద్ శివారులో ఒక ఇంటి వద్ద కనిపించిన స్కూటీని తీసుకుని నిమ్మనపల్లి గ్రామానికి వెళ్లారు. సెప్టెంబర్ 15 అర్ధరాత్రి ఒక ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించారు. అనంతరం ముగ్గురూ గుంటూరు మీదుగా గోవాకు పారిపోయారు. అక్కడ కొంత బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేశారు. దొంగిలించిన సొత్తులో తన వాటాగా వచ్చిన 2 తులాల బంగారు గొలుసును తన వద్దే ఉంచుకున్నాడు. మరోసారి దొంగతనం చేయాలనే ఉద్దేశంతో అదే కారులో పెద్దపల్లికి వచ్చిన సమయంలో కూనారం రైల్వే గేట్ సమీపంలో పోలీసులు అనుమానంతో పట్టుకున్నట్లు పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ రూరల్ ఎస్సై మల్లేశం తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన పెద్దపల్లి సీఐ కె. ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి రూరల్ ఎస్సై బి. మల్లేశ్, ఏఎసఐ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, పీసీలు ప్రభాకర్, పొగుల రమేష్, అనిల్‌లను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్, పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి, ఏసీపీ జి.కృష్ణ అభినందించారు.

## దొంగ దొరికాడు..!

**కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:**

మండలంలోని సుద్దాల గ్రామంలో ఎల్లమ్మ ఆలయ ఆవరణలో దొంగతనంకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పల్లిమక్త గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇటీవల జైలు నుండి రాగా తిరిగి ఎల్లమ్మ ఆలయంలో దొంగతనంకు పాల్పడి, అక్కడే ఉన్న కారును కూడా తానే స్వయంగా ధ్వంసం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. అయితే దొంగతనంకు పాల్పడిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

## మహిళా మృతి

**కాల్వ శ్రీరాంపూర్: ప్రభాతవార్త:**



పాము కాటుతో మహిళా మృతి చెందిన సంఘటన వెన్నంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పూసల వజ్రమ్మ అనే మహిళ తన ఇంటి ముందు ఉన్న వాకిలి ఊడు స్తుండగా, మహిళ కాలుపాదంపై నాగుపాము కాటు వేయగా, ఈ విషయాన్ని పక్కింటి వారికి మహిళా తెలుపడంతో వారు వడ్రంగి పని నిమిత్తం పెద్ద పెల్లికి వెళ్లిన మహిళ కుమారుడు పూసాల రమణ చారికి సమాచారం తెలపడంతో, గ్రామానికి వచ్చి, తల్లిని పెద్దపెల్లిలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు చికిత్స కోసం తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షి ంచి మహిళా మృతి చెందినట్లు తెలిపారు తెలపడంతో మృతురాలు కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు...

## పట్టపగలే అక్రమ ఇసుక రవాణా

**-రాత్రివేళల్లో కూడా తగ్గని జోరు**

**ముస్తాబాద్ ప్రభాత వార్త:**



మండలములో పట్ట పగలే అక్రమ ఇసుక రవాణా దర్జాగా కొనసాగు తుంది. నామాపూర్ నుండి గూడెం వైపు వెళ్తున్న క్రమములో వార్త పత్రిక రిపోర్టర్ కెమెరాకి చిక్కింది. అక్రమ ఇసుక రవాణాలో ముస్తాబాద్ మండలము మొదటి స్థానములో ఉండనడానికి ఇదొక నిదర్శనమే అని భావించవచ్చు. నియమ నిబంధనలను తుంగలో తొక్కుతూ దొరికితే దొంగ లేకపోతే సర్దార్ అనే మాదిరి ఇసుక రవాణా నడుస్తుంది. అర్ధరాత్రి వేళ లో ఎవరి అండదండలతో అక్రమ ఇసుకరవాణా నడుస్తున్నట్టు మండల ప్రజలు వాపోతున్నారు. ఇసుక సురుల ఆగడాలకు హద్దు హదుపు లేకుండా పోతుంది. అధికారులు తక్షణ చర్యలు తీసుకొని రాత్రి, పగటి వేళల్లో నడుస్తున్న అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోకపోతే రాబోయే రోజుల్లో ఇసుక కనుమరుగయ్యే అవకాశం ఉందని స్టానికులు అంటున్నారు. ఇప్పటికే ఆ వునూర్, రామలక్ష్మణ పల్లె, కొండాపూర్ గ్రామాల్లో ఇసుక కనుమరుగైపోంది. మండలం నుండి ఇసుకను పక్కజిల్లాలకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని స్థానికులు ముచ్చటిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సక్రమములో కూడా అక్రమాలు చేస్తూ పక్క మండలములోని ముచర్ల కు, సిద్దిపేట జిల్లాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక నైనా అధికారులు చర్యలు తీసుకొని ఈ అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## నేరాలు-దారుణాలు

## కోడి పందాల గుట్టురట్టు..

- కటకటాల పాలైన పందెం రాయుళ్లు
- 14 మంది అరెస్ట్, పరారీలో మరికొందరు..
- నగదు, వాహనాలు స్వాధీనం..
- పట్టుబడిన వారిలో మాజీ పోలీస్..
- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షి ంచం..
- పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి



**సుల్తానాబాద్, ప్రభాతవార్త:** కోడి పందాల మోజులో పడి పలువురు కటకటాల పాలయ్యారు. ఎలిగేడు మండలం శివపల్లి గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి 14 మందిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ఓ మాజీ పోలీసుతో పాటు ఓ తాజా ప్రజాప్రతినిధి కుమారుడు ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్‌రెడ్డి మంగళవారం సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ ఆధ్వర్యంలో సుల్తానాబాద్, పెద్దపల్లి సీఐలు పొన్నమనేని రంజిత్‌రావు, కె.ప్రవీణ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని బోడగుట్ట ప్రాంతంలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దుగ్యాల కార్తీక్‌రావు సారథ్యంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించి, నిర్వాహకులతో పాటు పాల్గొన్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి 13 మొబైల్ ఫోన్లు, రూ.40 వేల నగదు, 7 ద్విచక్ర వాహనాలు, ఒక ఎర్టిగా కారు, ఆరు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. గతంలో కూడా కొందరిపై కోడి పందాల కేసులు నమోదై ఉన్నట్లు డీసీపీ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతారని స్పష్టం చేశారు. మూగజీవాలను హింసించడం నేరమని, సంప్రదాయాల పేరుతో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలపై ప్రజలు 100కు డయల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, బసంత్‌నగర్ ఎస్సైలు చంద్రకుమార్, మధుకర్, సన్నత్‌రెడ్డి, శ్రీధర్, నరేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంబాన్ని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

**-ఒకరికి తీవ్ర గాయాలు**

**ముత్తారం, ప్రభాతవార్త:**



ద్విచక్ర వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంబాన్ని ఢీకొట్టిన ఘటన ముత్తారం మండలంలో చోటు చేసుకుంది. ముత్తారం మం డలం ముత్తారంపోతారం రహదారిపై జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహన దారుడు తుంట్ల కిరణ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనలో ఆయన ఎడమ భుజం విరిగి పోయింది. కుడి కాలుకు తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు గమనించి 108 సమాచారం అందించగా, 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ప్రశాంత్, పైలెట్ శ్రవణ్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందిస్తూ పెద్దపల్లిలోని జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన ముత్తారం108 అంబులెన్స్ సిబ్బందికి కిరణ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతుల ఆదాయానికి, ఆరోగ్యానికి సేంద్రియ వ్యవసాయమే భరోసా

మేడిపల్లి, ప్రభాతవార్త :

మండలం కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త భవ్య మాట్లాడుతూ రైతులకు సేంద్రియ వ్యవసాయం, సమగ్ర పోషక యాజమాన్యం నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల భూమి సారవంతం తగ్గిపోవడంతో పాటు పంట ఉత్పాదకతపై దీర్ఘకాలిక ప్రభావం పడుతుందన్నారు. సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతుల



వినియోగం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. రైతులు పంటల మార్పిడి విధానాన్ని అనుసరించడం, నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయడం, యూరియా అధిక వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా తగిన పంటలను ఎంపిక చేసుకోవడం, విశ్వవిద్యాలయం విడుదల చేసిన మెరుగైన వరి రకాల సాగుపై రైతులకు సూచనలు అందించారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా ఉత్పత్తి అయ్యే ఆహారం ఆరోగ్యకరంగా ఉండటంతో పాటు మార్కెట్లో మంచి ధర లభించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. టీచింగ్ అసోసియేట్ అష్ఫాక్ విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఉత్తమ వరి రకాల లక్షణాలు, దిగుబడి సామర్థ్యం, సాగు విధానాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి షాహిద్ అలీ, ఏఈవో మంజుల, గ్రామ రైతులు మార్గం నర్సా రెడ్డి, జలపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన నాగమణికి సన్మానం



భీమారం, ప్రభాతవార్త :

భీమారం మండలంలోని గోవిందారం గ్రామానికి చెందిన చెల్ల నాగమణి జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యింది. ఈనెల 24న ఒడిశాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుండగా, ఆమెను గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఉమారాణి దేవయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. నాగమణి ప్రయాణ ఖర్చుల నిమిత్తం సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపి చైర్మెన్ లు రూ. 6వేల ఆర్థిక సహాయం చేశారు. ఉప సర్పంచ్ బింగి స్వామి, ఏపీపీ చైర్మన్ ప్యాట లావణ్య నారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీషా లు పాల్గొన్నారు

## ముత్యంపేట నిజాం చక్కెర కర్మాగారం పునః ప్రారంభించాలి

**రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు విజ్ఞప్తి**

కోరుట్ల, ప్రభాతవార్త :

కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గం పరిధి మల్లాపూర్ మండలంలోని ముత్యంపేటలో టీఆర్ఎస్ ప్రభుత్వం మూసి వేసిన నిజాం చక్కెర కర్మాగారాన్ని వెంటనే పునరుద్ధరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం మూసివేసిన షుగర్ ఫ్యాక్టరీ వద్ద మీతో పాటు ప్రస్తుత ఉపముఖ్యమంత్రి అప్పటి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకులు బట్టి విక్రమార్క కాంగ్రెస్ శ్రేణులు అందరం కలిసి ధర్నా చేసిన విషయాన్ని మంత్రికి గుర్తు చేశారు. పునరుద్ధరణ పనులు చేపట్టే విషయంలో రాష్ట్ర మంత్రి సానుకూలంగా స్పందించారని జువ్వాడి కృష్ణారావు తెలిపారు.



## ప్లాస్టిక్ ను తరిమివేసేందుకు ప్రతి ఒక్కరు చైతన్యం కావాలి

**మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్**

చొప్పదండి, ప్రభాతవార్త:



అనేక అనారోగ్యాలకు ప్లాస్టిక్ వాడకం కారణం అవుతుంది అని, ఇలాంటి పరిస్థితి లో ప్లాస్టిక్ వాడకం సంపూర్ణంగా నిషేధించాలని, అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చొప్పదండి మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్ పిలుపును ఇచ్చారు. ఈ మేరకు మంగళ వారం పట్టణం లోని 5వ వార్డు లో ప్లాస్టిక్ ను నిషేధించు క్యాన్సర్ ను తరిమివెయ్యి అనే నినాదం తో యువకులు తమ స్వంత ఖర్చులతో ప్లాస్టిక్ ప్లేట్స్ వాడకాన్ని తగ్గించాలని ఒక కొత్త ఒరవడి కి శ్రీకారం చుడుతూ 200 స్టీల్ ప్లేట్లను శ్రీ అభయాంజనేయ దేవస్థానం లో హనుమాన్ జయంతి ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్ పాల్గొన్నారు. కార్యక్రమంను చైర్మన్ కొత్తూరి మహేష్, 5వ వార్డు కౌన్సిలర్ వడ్లూరి అనూష శ్యాంసుందర్ లు ప్రారంభించారు. మాజీ జెడ్పీ టి సి ఇప్పనపల్లి సాంబయ్య, పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు దండే రాజయ్య, పద్మశాలు సంఘం పట్టణ అధ్యక్షులు పచ్చునూరి తిరుపతి, యువజన సంఘం అధ్యక్షులు అనుమాండ్ల సత్యం, సబ్ కమిటీ చీఫ్ ఎన్నం మునీందర్ తో పాటు కుల సంఘ నాయకులు, బి సి కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## మానాల రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

మల్యాల/ ప్రభాత వార్త

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికలలో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు, ఈ సందర్భంగా జనుము, జీలుగ, విత్తనాలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు, కాగా, మల్యాల మండలం మానాల రైతు వేదికలో వ్యవసాయ అధికారి చంద్ర దీపక్, మానాల గ్రామ సర్పంచ్ బలమూరి పాపారావు తో పాటు తక లపల్లి సింగిల్ విండో చైర్మన్, సీ ఈ వో కొమురవెల్లి మనోజ్ కుమార్ తోపాటు సొసైటీ పరిధిలోని రైతులు పాల్గొనగా, జనుము, జీలుగా విత్తనాలతో రాబోయే వానకాలం పంట సాగు ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు,



**కోరుట్ల వార్త**

## ఎస్ఎస్సి బ్యాచ్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

మేడిపల్లి, ప్రభాతవార్త :



మండలంలోని పిఎన్ఆర్ గార్డెన్లో 200001 పదవ తరగతి మేడిపల్లి విద్యార్థుల సిల్వర్ జూబ్లీ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలనాటి స్మృతులను స్మరించుకుంటూ సంతోషంగా వేడుకలను నిర్వహించారు. అలనాటి విద్యార్థులు చేపూరి నాగరాజు, మెట్టు ప్రకాష్, కుందారపు హరే రామ్, బలగం రాజేష్, నరేష్, గుడికందుల సురేందర్, బొడ్డుపల్లి రాజేందర్, పుల్లల వేణు, గట్ల వేణు, బొంగోని మహేష్, బండ్ర రమేష్, తిరుపతి పాల్గొన్నారు.

## పెన్షన్ లబ్ధిదారుల ముఖచిత్ర ధ్రువీకరణ ప్రారంభం

**కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్**

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణ 13వ వార్డులో మంగళవారం పెన్షన్ లబ్ధిదారుల ముఖ చిత్ర ధ్రువీకరణ కార్యక్రమాన్ని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భం గా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మే 16 నుంచి జూన్ 15 వరకు నెలరోజులు కొత్త ముఖచిత్ర ధృవీకరణ విధ్నాన అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు కోరుట్ల మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లేందుకు దూర ప్రయాణం రావాల్సి ఉండడంతో ప్రజల ఇబ్బందు లను దృష్టిలో ఉంచుకొని వార్డు ప్రజల సౌకర్యార్థం స్థానికంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం వారం రోజుల పాటు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12, సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు ధ్రువీకరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డు ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ ఆర్పి, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణి లకు యోగ కార్యక్రమం

మేడిపల్లి, ప్రభాతవార్త :



మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం గర్భిణి లకు యోగ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్ సి ని సందర్శించిన డిప్యూటీ డిఎంహెచ్ఓ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ యోగ చేయడం వల్ల గర్భంలో పిల్లల పెరుగుదల, తల్లుల ఆరోగ్యం రెండు బాగుంటాయిన్నారు. మండల వైద్యధికారి ఎం. రమాదేవి మాట్లాడుతూ ప్రతి మంగళవారం ప్రత్యేకంగా నిర్వాహించే యోగ మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని గర్భిణిలలో వచ్చే బీపీ లాంటివి అదుపులో వుంటాయన్నారు. హాస్పిటల్ సిబ్బంది తో పాటు ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలి

**-కలెక్టర్ కె.హరిత**

**కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 19, ప్రభాతవార్త:** జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తో కలిసి ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలు ప్రారంభం అయ్యేలోపు ఇంజనీరింగ్ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి మారుమూల గ్రామాలకు త్రాగు నీరు అందించాలని, పైప్ లైన్ల మరమ్మత్తులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ పనులు, సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించి దరఖాస్తుదారులకు భరోసా కల్పించాలని తెలిపారు. ప్రస్తుతం యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, అధికారులు ప్రతిరోజూ తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. శాఖల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, ఇతర కార్యక్రమాల వివరాల నివేదికను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**-కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, మే 19, ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం సబ్బపల్లి లోని గోదాము, నస్పూర్ మండల కేంద్రంలోని గోదాము, లక్సెట్టిపేట మండలం గుల్లకోట లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, వెంకట్రావుపేట లోని గోదాము, లక్ష్మీపూర్ లలో గల రైస్ మిల్లులను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, దండేపల్లి మండలం కన్నెపల్లిలో గల రైస్ మిల్లును మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, తరలింపు ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన



ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. రైస్ మిల్లుల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాలనుండి వచ్చిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, ఇందుకు అవసరమైన హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో త్వరగా సాధించే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. లారీల యజమానులు ధాన్యం తరలింపులో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. గోదాములకు తరలించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని, తదుపరి ఆదేశాల ప్రకారం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతి వేగంగా చేయాలి

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జైపూర్, మే 19, ప్రభాతవార్త:**



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో ధాన్యం దిగుమతి వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం లో గల సుముఖ గోదాము, జయలక్ష్మి రైస్ మిల్ లను మండల తహసిల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా గోదాములు, రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో లారీల నుండి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని, రోజుకు 10 నుండి 15 లారీలు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు సి ఎం ఆర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని, కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కౌమార బాలికల హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్

**వేములవాడ, ప్రభాతవార్త:** వేములవాడ మున్సిపల్ పరిధిలో కౌమార బాలికల హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్‌ను స్థానిక బస్తీ దవాఖానాలో మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి.లోకేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 15 నుంచి 18 సంవత్సరాల కౌమార బాలికలకు హెల్త్ స్క్రీనింగ్‌లో అనీమియా, డయాబెటిక్, బిఎంఐ వంటి టెస్ట్‌లు చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఎటి ఫసత్ అలీ బేగ్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ నయీం, సిడిపిఒ సౌందర్య, టిఎంసి భూలక్ష్మి, బస్తీ దవాఖాన డాక్టర్లు, సిబ్బంది, ఎఎన్ఎంలు, మెప్మా సిఎల్ఆర్‌పిలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.



## తిప్పాపురం గోశాలలో శ్రమదానం



**వేములవాడ,ప్రభాతవార్త:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఉన్న తిప్పాపురం గోశాలలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రైతులు విరాళంగా అందించిన సుమారు 70 టన్నుల ఎండుగడ్డిని గోశాలలో భద్రపరిచే కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఈఈ, ఏఈ, ఏఈఓలు, పర్యవేక్షకులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, కింది స్థాయి ఉద్యోగులు ఉదయం 6గంటల నుంచే పాల్గొని గడ్డి కట్టలను గోశాలలో సక్రమంగా వేరు చేసి నిల్వ చేశారు. వేములవాడ దేవస్థానం కేవలం ఆధ్యాత్మిక సేవలకే పరిమితం కాకుండా గోసంరక్షణ, అన్నదానం, పర్యావరణ పరిరక్షణ వంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. తిప్పాపురం గోశాలలో నిర్వహించిన ఈ శ్రమదానం కార్యక్రమం ఆలయ సేవా తత్వానికి నిదర్శనంగా నిలిచిందన్నారు.

## తంజీమ్ సేవా కార్యక్రమాలకు సహకరించాలి

**ముస్లిం ఫ్రెండ్స్ సంక్షేమ సంస్థకు మద్దతు కోరిన నిర్వాహకులు**



**గోదావరిఖని,ప్రభాతవార్త:** సమాజ సేవలో ముందుండి పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న రామగుండం ముస్లిం ఫ్రెండ్స్ సంక్షేమ సంస్థ "తంజీమ్"కు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని సంస్థ నిర్వాహకులు కోరారు. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో మజీద్ అధ్యక్షుడు షేక్ అలీ మాట్లాడారు. తంజీమ్ సభ్యులు నిరుపేదల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఆహారం, వస్త్రాలు, అవసరమైన సహాయం అందిస్తున్నారని తెలిపారు. వారి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత ఆర్థిక సహాయం అందిస్తే మరింత మందికి సేవలు చేయగలమన్నారు. ప్రస్తుతం నగరంలో జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించి స్థానిక దృశ్య మాధ్యమాల్లో కూడా ప్రజలు చూస్తున్నారని చెప్పారు. సేవా భావంతో ముందుకు వస్తున్న యువతను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడిన మౌలానా, పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న సంస్థలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. అవసరమైన వారికి సకాలంలో సహాయం అందించడం ఎంతో పుణ్యకార్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, యువకులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులు సమన్వయంతో పంటను విక్రయించుకోవాలి

**-ఎమ్మెల్యే విజయరమణరావు**

**ఓదెల,ప్రభాతవార్త:** ఓదెల మండలంలోని కొలనూర్, ఓదెల, పొత్కపల్లి, జీలకుంట గ్రామాల్లో మార్క్ ఫెడ్ మరియు ఐకెపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్లు మరియు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అనంతరం పొత్కపల్లి సబ్ మార్కెట్ వద్ద మక్కల గోదామును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ వడ్లు, మక్కల కొనుగోళ్ల విషయంలో రైతులెవరూ అధైర్యపడొద్దని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గమంతటా కొనుగోళ్లు, దిగుమతులు రైస్ మిల్లులకు సరఫరా పారదర్శకంగా సాగుతున్నాయని చెప్పారు. వంటకు మద్దతు ధర !! దిగుబడి, మక్కలకు ప్రభుత్వం క్వింటాలుకు కనీస మద్దతు ధర నిర్ణయించిందని, ఈసారి ఎకరానికి మక్కలు 40 క్వింటాళ్లు, వడ్లు 30 నుండి 40 క్వింటాళ్ల వరకు బంపర్ దిగుబడి వచ్చిందని తెలిపారు. మరో 1012 రోజుల్లో వర్షాలు/తుఫానులు వచ్చే అవకాశం ఉన్నందున రాబోయే రోజులు చాలా కీలకమైనవని చెప్పారు. మక్కల కొనుగోళ్లకు ఈ నెల 27వ తారీఖే కటాఫ్ డేట్ అని, రైతులు ఆలస్యం చేయకూడదని హెచ్చరించారు. ఇంకా 89 రోజులే సమయం ఉన్నందున రైతులు త్వరపడాలన్నారు. అలాగే పొత్కపల్లి వద్ద మక్కల గోదాముతో పాటు, అదనంగా శ్రీరాంపూర్‌లో కూడా 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును ఏర్పాటు చేశామన్నారు. రేపటి నుండి శ్రీరాంపూర్ మక్కలను అక్కడే ఉంచుతారని, దీనివల్ల రైతులకు రవాణా ఖర్చులు, దూరం తగ్గుతాయని వివరించారు. రైతుల సొంత ఏర్పాట్లు గన్నీ సంచుల రీయింబర్స్‌మెంట్ ప్రస్తుతం ఎండ తీవ్రత వల్ల కొంత హమాలీ (కూలీల) సమస్య ఉన్నందున, రైతులు హమాలీల కోసం చూడకుండా ఒకరికొకరు సహకరించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే సంచుల కోసం ఎదురుచూడకుండా రైతులు సొంతంగా గన్నీ సంచులు కొనుక్కున్నా ఒక్కో సంచికి రూ. 21 చొప్పున ప్రభుత్వమే తిరిగి వారి అకౌంట్లలో జమ చేస్తుందని స్పష్టం చేశారు. రైతులు సమన్వయంతో ఉండి పంటను త్వరగా అమ్ముకోవాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో పొత్కపల్లి సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, మండల పార్టీ అధ్యక్షులు మరియు పలు గ్రామాల సర్పంచ్లు, ఉపసర్పంచ్లు రైతులు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ ద్వేషంతో సీఎం రేవంత్‌పై ఎంపీ అరవింద్ విమర్శలు

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రైసుద్దీన్



**మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:** రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ రైసుద్దీన్ మాట్లాడుతూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ ద్వేషంతో కూడుకున్న వన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత కలిగిన నాయకుడని, పార్టీ బలోపేతం కోసం ఎన్నో సంవత్సరాలుగా అహర్నిశలు కష్టపడ్డారని పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్ పట్ల నమ్మకాన్ని పెంచడంలో ఆయన నాయకత్వం ఎంతో ప్రభావం చూపిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటానికి రేవంత్ రెడ్డి చేసిన పోరాటం మరువలేనిదని అన్నారు. రాబోయే 2029 పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడటమే రేవంత్ రెడ్డి లక్ష్యమని, దేశ రాజకీయాల్లో బీజేపీకి ప్రత్యామ్నాయ శక్తిగా కాంగ్రెస్ పార్టీ ఎదుగుతోందని వ్యాఖ్యానించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని, అదే కారణంగా బీజేపీ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ తరఫున ధర్మపురి అరవింద్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజలను తప్పుదారి పట్టించే రాజకీయాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అంగీకరించదని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్‌తో పాటు కౌన్సిలర్లు బత్తుల నరేష్, ఖాజా అజీమ్, పందిరి రమేష్, గుడిగంధుల అజయ్, రెబ్బస్ మహేష్ యాదవ్, నునుగొండ నరేష్, షేక్ ముఖీం, ఫసీ బేగ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు పెంట ప్రణయ్, బర్ల వంశీ, బర్ల సూరి,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు

### జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత.





**మెట్‌పల్లి, ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా,వేగవంతంగా సాగేలా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)బి.ఎస్ లత అన్నారు.మెటుపల్లి మండలంలోని వేంపేట,మల్లాపూర్ మండలంలోని ముత్యం పేట,చిట్టాపూర్,రాఘవపేట గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను,రాఘవపేట గ్రామంలోని పూజ ఇండస్ట్రీస్,విష్ణు ఇండస్ట్రీస్ లను అదనపు కలెక్టర్ బి.ఎస్ లత మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని,ధాన్యం లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు,ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని,ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం,నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని,రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు.ధాన్యంతో వచ్చిన లారీలు మిల్లుల వద్దా నిలుపకుండా వెనువెంటనే అన్లోడ్ చేసేలా హమాలీల సంఖ్య పెంచుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో మెటుపల్లి ఆర్డీవో నరసింహ రావు,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ అరవింద్ దిష్టిబొమ్మ దహనం

### మెట్పల్లి అర్బన్, ప్రభాతవార్త :



పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం,మాజీ సర్పంచ్ కొమిరెడ్డి లింగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం యం పి ధర్మపురి అరవింద్ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. సోమవారం రోజున జగిత్యాల్ జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నందుకు నిరసనగా కొత్త బస్టాండ్ చౌరస్తాలో అరవింద్ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు, సీఎం రేవంత్ రెడ్డి,ఉత్తంకుమార్ రెడ్డి లకు ఎంపీ అరవింద్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలతో అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి నేటి వరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు ఇవ్వకుండా సంక్షేమ పథకాలు ఆపకుండా అహర్నిశలు ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి అందె మారుతి బాపూజీ, ఎండోమెంట్ చైర్మన్ కొమ్ముల సంతోష్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ యువజన అధ్యక్షులు సుంకే ప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొంతుల వెంకటేశ్వర్లు, సమీర్ సర్కార్ ఎన్ఎస్యూఐ టౌన్ వైస్ ప్రెసిడెంట్ వంగ వేణు,ఆగ బాలయ్య,తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్య పట్ల రాత్రి పూట ఫోన్ చేసిన కౌన్సిలర్ స్పందించిన మున్సిపల్ చైర్మన్

**జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:** జమ్మికుంట పట్టణ పరిధిలోని రామన్నపల్లి 3వ వార్డు కౌన్సిలర్ కొలకని రాజకుమారిరాజు వారి వార్డులో నల్ల నీటి సమస్య పట్ల మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)కు రాత్రిపూట ఫోన్ చేయగా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించారు. ప్రస్తుత ఎండాకాలం దృష్ట్యా వార్డులో నల్ల నీళ్లు లేక ప్రజలు పడుతున్న సమస్యలను రాత్రి పూట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ కి ఫోన్ చేసి గేట్ వాల్ లీకేజీ సమస్య వివరించగా వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ సంబంధిత అధికారులు ఏఈ వికాస్ కి ఫోన్ చేసి తక్షణమే సమస్య పరిష్కారం కావాలని వారితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కరించారు. ప్రజలకు తమ పాలకవర్గం రాత్రింబవళ్లు ఎల్లవేళల అందుబాటులో ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొలకాని రాజకుమారిరాజు ఏఈ వికాస్ మిషన్ భగీరథ ఏఈ తదితరులు పాల్గొన్నారు.




# నిరుపేదల కోసం ఉపాది హామీ పథకం

### మల్లాపూర్, ప్రభాతవార్త:



నిరుపేదలకు ఉపాధి హామీ పథకం ఉపయోగకరమని, ఉపాధి హామీ పనులను మల్లాపూర్ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మంగళవారం పరిశీలన చేశారు. నేరుగా కూలీలను కలిసి పనుల ప్రాముఖ్యతను వివరిస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉపాధి కల్పనకై జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చారని వివరించారు. పని ప్రదేశాలలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారం గురించి తెలుసుకున్నారు. వీరి వెంట వార్డు సభ్యులు ముష్కరి రమేష్,ఫీల్డ్ అసిస్టెంట్ రామ నవీన్, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి ఉన్నారు.

# ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

### మెట్‌పల్లి,ప్రభాతవార్త:



మండలంలోని వెల్లుల్ల ఎల్లమ్మ దేవాలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఒక్క రోజు హుండీ లెక్కింపు నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ సేవ టికెట్స్ ద్వారా వచ్చిన ఆదాయము రూ.77,701/,అమ్మవారి హుండీలు లెక్కించగా రూ.10,641/లు సమకూరినట్లు ఆలయ ఈవో కాంత రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు ఎం రాజా మొగిలి,వివిధ ఆలయాల దేవాదాయ శాఖ డిప్యూటేషన్ స్టాఫ్ కల్వకుంట్ల అనిల్ రావు, కూకట్ల రాజేందర్,గుంటుక శివ కేశవ్,మృత జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# బిజిగిర్ షరీఫ్ దర్గా వద్ద సీసీ కెమెరాలను ప్రారంభించిన హుజూరాబాద్ ఏసిపి మాధవి



**జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;** బిజిగిర్ షరీఫ్ దర్గాలో ఈనెల 28న జరిగే ఉరుసు ఉత్సవాల సందర్భంగా హుజరాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట సిఐ రామకృష్ణ గౌడ్, బిజిగిర్ షరీఫ్ గ్రామ సర్పంచ్ రాచపల్లి వనజరాజయ్య కలిసి దర్గా కమిటీ వారు అమర్చిన పది సీసీ కెమెరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ ఏసీబీ మాధవి సిఐ రామకృష్ణ గౌడ్ సర్పంచ్ రాచపల్లి వనజరాజయ్య, వార్డు సభ్యుడు నయీముద్దీన్ కు శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ దర్గాకు వచ్చే భక్తుల భద్రత కోసం దర్గా వద్ద సీసీ కెమెరాలు అవసరమని దర్గా కమిటీ కు వివరించగా వారు తక్షణమే స్పందించి సీసీ కెమెరాలు అమర్చినందుకు దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ కు ఏసిపి శాలువాతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌఫిక్ హుస్సేన్, సభ్యులు సర్వర్, అలీ షరీఫ్, అజ్మత్, రెహాన్, అయాన్ తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు

విద్యార్థులు, యువత వివిధ శిక్షణ సంస్థల కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :**

నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు వస్తాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శిక్షణ సంస్థలు ఐటీఐ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సెటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్, ఇతర సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు? అర్హత ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో నేటి యువత, విద్యార్థులు చాలా కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటీవల విద్యా శాఖ వారోత్సవాల కింద సమ్మర్ క్యాంపులు నిర్వహించామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఎన్నో అంశాల్లో ప్రతిభ చూపారని గుర్తు చేశారు. విద్యతోపాటు ఆటలు ఆడాలని, దీంతో శారీరక, మానసిక సమతుల్యత ఉంటుందని, క్రమ శిక్షణ అలవడుతుందని వివరించారు. ఉన్నత చదువుతోపాటు టెక్నికల్ స్కిల్స్,



సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఇప్పటి పరిశ్రమలకు ఎలాంటి స్కిల్స్ అవసరమో తెలుసుకొని ఆ దిశలో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అందిస్తున్న స్వయం ఉపాధి స్కీములు, సబ్సిడీ సద్వినియోగం చేసుకొని.. స్వయం యువత ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. జిల్లాలోని వివిధ శిక్షణ సంస్థలు ఏడాది అంతా యువతకు శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లాలని సూచించారు. నర్సింగ్ పూర్తి చేసి.. విదేశాల భాష, నైపుణ్యాల్లో పట్టు ఉన్న వారికి టామ్ కామ్ ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో ఉపాధి కల్పన అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. జిల్లా నుంచి ఇప్పటిదాకా 45 మందికి విదేశాల్లో కొలువులు వచ్చాయని తెలిపారు. యువత ఉపాధిని పొంది తమ తల్లితండ్రుల సంరక్షణ బాధ్యతను చూసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు, డీవైఎస్ఓ రాందాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల వార్త



## మున్సిపల్ ఆధ్వర్యంలో హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు

**సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :**



సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో కౌమారా బాలిక హెల్త్ స్క్రీనింగ్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. 10 నుండి 19 సంవత్సరాల వయసు మధ్య గల బాలికలు కౌమార దశలో రక్తహీనత వల్ల చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది దీనివల్ల వారు మానసికంగా శారీరకంగా అనారోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుంది అన్నారు .కౌమార దశలో ఉన్న బాలికలు అందరూ నేటినుండి ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ హెల్త్ క్యాంపు యొక్క సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిని, మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదీర్ పాషా , మెప్మా ఏ.వో ఫసహత్ అలీ బెగ్, కౌన్సిలర్ సభ్యులు బత్తుల రమేష్ , వైద్యాధికారులు నాయిమ, డాక్టర్ సాహితి పాల్గొన్నారు.

## ఐకేపీ కి స్థలం కేటాయించాలి

**ముస్తాబాద్ ప్రభాత వార్త:**



సేవాలాల్ తండా గ్రామములో గ్రామ రైతులు వడ్లు ఆరబోయడానికి స్థలము లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు.వెంటనే స్పందించి ఐకేపీ స్థలానికి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని గ్రామఉప సర్పంచ్ కట్లవేణు ఆధ్వర్యములో మండల తహశీల్దార్ అబ్దుల్ ఫారూఖ్ కు మంగళవారం వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో ఏఎంసి డైరెక్టర్ లకావత్ మున్నా నాయక్,మాజీ వార్డు సభ్యులు మూడవాత్ నాగరాజు,నాయకులు కట్ల అజయ్ లు పాల్గొన్నారు

## ఘనంగా చౌడాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామంలోశ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో చౌడాలమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేతిరెడ్డి నవీన్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణంలోభాగంగా 84 వేల రూపాయల విలువగల గ్రానైట్ మార్బుల్స్ నవీన్ రెడ్డి శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు కేతిరెడ్డి స్వప్న నవీన్ రెడ్డిని శాలువాతో సత్కరించి సన్మానించారు. చౌడాలమ్మ దయతో వంట పొలాల సుభిక్షంగా పండాలని, రైతులు, ప్రజలందరూ, సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని కోరినట్టు నవీన్ రెడ్డి తెలిపారు .

## లారీల సంఖ్యను మరింత పెంచాలి

ఐకేపీ కొనుగోలు కేంద్రం, రైస్ మిల్లును పరిశీలించిన కలెక్టర్, ఎస్ పి

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించేందుకు కాంట్రాక్టర్లు లారీల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ గరిమా అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాల గూర్చి జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆరా తీశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం సంచుల కోసం మరిన్ని వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైస్ మిల్లులో తనిఖీమండలంలోని చింతలకుంటపల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీసాయి రైస్ మిల్లును జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, జిల్లా అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ధాన్యం లక్ష్యం కేటాయింపు ఎంత, ఇప్పటి వరకు ఎంత అన్ లోడ్ చేశారు, ఏ ఏ మండలాల నుంచి ధాన్యం సేకరణ జరిగిందో ఆరా తీశారు. హమాలీల సంఖ్యను పెంచి అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించా లారీల సంఖ్య పెంచాలని కలెక్టర్ కు సర్పంచ్ వినతి మండలములోని వెల్జి పూర్ కొనుగోలు కేంద్రం లో ధాన్యం ~లింపుకు లారీల సంఖ్య పెంచాలని కలెక్టర్ కు సర్పంచ్ నాయిని నవీన్ విన్నవించగా, స్పందిన కలెక్టర్ ఏర్పాటు చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహా, డీసీఓ రామకృష్ణ, తహసీల్దార్ రాచకట్ల సురేష్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు

## కమ్యూనిస్ట్ యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



కమ్యూనిస్ట్ యోధుడు,పేదల పక్షపాతి పుచ్చల పల్లి సుందరయ్య కన్న ఆశయాలను నెరవేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరు నర్సయ్య పేర్కొన్నారు. 41వ వర్ధంతి సందర్భంగా మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామంలో ఉపాధి కూలీల ఆధ్వర్యంలో ఆయనకు మంగళవారం ఘన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు నిర్మాత, బడుగు బలహీన వర్గాల పక్షపాతి, అభ్యుదయ వాది సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలోఉపాధి హామీ కార్మికులు రాజిరెడ్డి, తిరుపతి, భారతి, మల్లారెడ్డి, మల్లయ్య, లక్ష్మి, రాజు ,శ్రీనివాస్, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు

## ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

**తంగళ్ళపల్లి, ప్రభాతవార్త**

..తంగళ్లపల్లి మండలంలో ఏర్పడిన ఎంఆర్ఓ, ఎంపీడీఓ (పోస్ట్)ఖాళీలను వెంటనే భర్తీ చేయాలనీ జిల్లా కలెక్టర్ కు తంగళ్ళపల్లి మండల సర్పంచులు వినతిపత్రం అందజేశారు. మండలానికి ఎంఆర్ఓ లేక పరిపాలన అనుమతులు, ఇసుక పర్మిషన్ ఇవ్వక ఇండ్ల నిర్మాణాలు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని సర్పంచ్ లు పేర్కొన్నారు. మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ను ఆయా గ్రామాల సర్పంచులు కలిశారు. గ్రామాల్లో పని చేస్తున్న ఎంపీడబ్ల్యు, మల్టీపర్పస్ వర్కర్లకు మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వారికి జీతాలు వెంటనే మంజూరు చేయాలనీ సర్పంచులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తంగళ్ళపల్లి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పూర్మాని రాజశేఖర్ రెడ్డి, మండల సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు

## యువకుడి వైద్యానికి ఆర్థిక చేయూత

**గంభీరావుపేట, ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నిరుపేద యువకుడికి మంగళవారము ఆర్థిక చేయూత అందించారు. గంభీరావు పేట మండలం నర్మాల గ్రామానికి చెందిన కోన సురేష్ బ్రతుకు దెరువు కోసం దుబాయి వెళ్ళాడు. గత నెల తన సోదరి పెళ్ళి నిశ్చితార్థానికి స్వదేశానికి వచ్చిన సురేష్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. నిరుపేద కుటుంబానికి చెంది మంచాన పడడంతో విషయం తెలుసుకున్న దుబాయ్ ఎల్లాల శ్రీనన్న సేవాసమితి తమ వంతు సహాయంగా రూ. 18వేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందించారు. విషయం తెలిపిన వెంటనే ఆర్థిక సహాయం అందించాల్సిందిగా సేవా సమితి ఉపాధ్యక్షుడు బాలు బొమ్మిడి, అధ్యక్షుడు రవి డేవిడ్, డాక్టర్ ఎల్లాల శ్రీనన్నా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సేవాసమితి సభ్యులు తమ వంతు సహాయంగా కోన సురేష్ కు అందించారు. సహాయం అందించిన వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి ఉపాధ్యక్షుడు బాలు బొమ్మిడి, బొప్పాపూర్ మాజీ సర్పంచ్ బిమేష్, కూరాకుల రాజు, వంపరి సురేష్, మాదా జనర్దన్ లు పాల్గొన్నారు



# జగిత్యాల వార్త

## మామిడి మార్కెట్ వ్యాపారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలి

రూరల్ ఎస్.ఐ. ఉమాసాగర్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ చెల్గల్ మ్యాంగో మార్కెట్‌లో మంగళవారం రోజున జగిత్యాల రూరల్ ఎస్.ఐ ఉమా సాగర్ ఆధ్వర్యంలో రైతులు, వ్యాపారులు కొనుగోలుదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాపార లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ సూచించారు.ఇటీవల కాలంలో ఇతర రాష్ట్రాల నుండి వస్తున్న కొందరు వ్యక్తులు, రైతులు,స్థానిక వ్యాపారుల వద్ద నుండి మామిడి కాయలను కొనుగోలు చేసి, లారీలలో లోడ్ చేసుకున్న తర్వాత "సరుకు గమ్యస్థానానికి చేరగానే డబ్బులు పంపిస్తాము" అని నమ్మబలుకుతూ మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి.ఈ నేపథ్యంలో, మార్కెట్‌లో రిజిస్ట్రేషన్ పొందిన వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు మోసపోకుండా ఉండేందుకు పోలీసులు పలు కీలక సూచనలు చేశారు.గుర్తు తెలియని వ్యక్తులతో ఎలాంటి వ్యాపార లావాదేవీలు నిర్వహించరాదని,కొనుగోలుదారుల పూర్తి వివరాలు,వారి ఆధార్



కార్డులు,మొబైల్ నంబర్లు సరుకు తీసుకెళ్లే వాహన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎస్.ఐ. తెలిపారు.ముఖ్యంగా,పూర్తి చెల్లింపులు అందిన తర్వాతే మామిడి కాయలను అప్పగించాలని, నగదు లేదా ఆన్‌లైన్ చెల్లింపులను పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతే సరుకును పంపించాలని స్పష్టం చేశారు. మార్కెట్ పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, రైతులు వ్యాపారులు అప్రమత్తంగా ఉండి మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

## జిల్లాలో 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

-కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:





జగిత్యాల జిల్లాలో 441 కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, ఇప్పటి వరకు రైతులకు 353.71కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత తో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సమవేశం లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 441 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ సీజన్లో 5 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామని అన్నారు. ఇప్పటికే 3. 50 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోళ్ల కోసం వచ్చిందని తెలిపారు. వచ్చిన ధాన్యం నుండి 2.30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేశామని, రైతులకు ఇందుకు సంబంధించి 353.71 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని వారం రోజుల్లోనే రికార్డు స్థాయిలో దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. రానున్న వారంలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళికతో ఉన్నామని అన్నారు. జిల్లా లోని 96 మిల్లులకు ధాన్యం మిల్లులకు తరలించడానికి 736 లారీలు, 199 డీసీఎం వ్యాన్ లు, 173 ట్రాక్టర్ లు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉంటూ కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మన జిల్లాకు 1.60 లక్షల మెట్రిక్ టన్నుల టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు 1.25 లక్షల కొనుగోళ్లు పూర్తి చేశామని తెలిపారు.రానున్న రెండు వారాలు మరింత కీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీల సమస్య ప్రధానంగా కనిపిస్తోందని, లోకల్ హమాలీలను ప్రోత్సహిస్తూ ఈ సమస్యను అధిగమిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం రవాణాకు సంబంధించి పూర్తిస్థాయిలో అధికారాలు ఇచ్చామని, లారీ అసోసియేషన్ ప్రతినిధులు సహకరించి కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని ఆదేశించామని తెలిపారు. ట్రాన్స్పోర్ట్ కు ఎలాంటి ఇబ్బందులూ తలెత్త కుండా చూసుకోవాలని, జిల్లా పంచాయతీ అధికారి హమాలీల సమస్య పరిష్కారమయ్యేలా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ధాన్యం లోడు పూర్తయిన ప్రతి వాహనం 24 గంటల్లోగా మిల్లులో అన్లోడ్ అయ్యేలా ప్రతి 6 గంటలకు ఒకసారి రిపోర్ట్ లు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎక్కువ పరిమాణంలో ధాన్యం కొనుగోలు చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గోదాములను స్టోరేజీ కోసం వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.ఈ నెల ఆఖరులోగా 80 శాతం కొనుగోళ్లు పూర్తి చేస్తామని అన్నారు.ధాన్యం కొనుగోళ్లు 100 శాతం పూర్తయ్యే విధంగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నామని ధాన్యం కొనుగోళ్లు విజవంతంగా పూర్తి కావడానికి రైతులందరు సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత, డి సి ఎస్ ఓ జితేందర్ రెడ్డి, డి ఎం జితేంద్ర ప్రసాద్, డి పి ఆర్ ఓ పి. నరేష్, మీడియా ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థిని శ్రీజ కి ప్రతిభ పురస్కారం

మానకొండూర్, ప్రభాతవార్త :



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో పిఆర్ టి యు టీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మానకొండూరు మండలం పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి ఫలతాల్లో శ్రీజ 576 మార్కులు సాధించడం పట్ల విద్యార్థిని శాసనమండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రశంస పత్రం మెమొంటోను అందజేశారు. అలాగే పదవ తరగతి ఫలితల్లో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మశ్రీ ఉపాధ్యాయులు లను అభినందించారు.ఈ కార్యక్రమం లో పి ఆర్ టి యు జిల్లా అధ్యక ప్రధాన కార్యదర్శులు కరుణాకర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా మండల కార్య వర్గ సభ్యుల్లు పాల్గొన్నారు.

## వేములవాడ ప్రాంత ప్రజలను చల్లగా చూడాలి

– వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

– ధర్మపురి, కొండగట్టులను దర్శించుకున్న చైర్మన్

వేములవాడ, ప్రభాతవార్త:

వేములవాడ ప్రాంత ప్రజలను చల్లగా చూడాలని భగవంతున్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు వేడుకున్నారు. మంగళవారం జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఆలయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వారిని, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్దకు చేరుకున్న మున్సిపల్ చైర్మన్ దంపతులకు, కుటుంబ సభ్యులకు ఆయా దేవస్థానాల అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీనరసింహ స్వామివారికి, ఆ తర్వాత కొండగట్టులో అంజన్న స్వామివారికి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా స్వామివార్లకు 101 కొబ్బరి కాయలు కొట ఇటమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు వారికి వేదాశీర్వచనం చేయగా, అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను, శేషవస్త్రాలను అందజేశారు.



## నర్సింగాపూర్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

ఎంపీ అర్వింద్‌కు సర్పంచ్ వినతి

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ నర్సింగాపూర్ గ్రామంలో కేంద్రియ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఆ గ్రామ సర్పంచ్ వంశీ,పాలక వర్గం గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు.నర్సింగాపూర్ శివారులోని సర్వే నెంబర్ 437లో సుమారు 300 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని,అందులో గతంలో వంద ఎకరాల వరకు కబ్జాకు గురైందని వారు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.గతంలో ఇక్కడ అక్రమంగా కొనసాగిన ఇటుక బట్టీలను ప్రభుత్వం తొలగించి, భూమిని స్వాధీనం చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు.అయితే,ఇటీవల మళ్లీ కొంతమంది వ్యక్తులు అదే ప్రాంతంలో ఇటుక బట్టీల నిర్వహణ పేరుతో ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలంటే, అక్కడ కేంద్రియ విద్యాలయాన్ని ఏర్పాటు చేయడం సరైన పరిష్కారమని వారు కోరారు. విద్యా సంస్థ ఏర్పాటు ద్వారా భూమికి రక్షణ లభించడంతో పాటు,ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తుందని వివరించారు. ప్రభుత్వ భూములను రక్షి ంచి, విద్యాభివృద్ధికి సహకరించాలని వారు ఈ సందర్భంగా ఎంపీని కోరారు.

## మాజీ మంత్రి రాజేశం గౌడ్‌ను పరామర్శించిన మాజీ మంత్రి సుద్దల దేవయ్య

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ గోడిశెల రాజేశం గౌడ్ ని మాజీ మంత్రి, సుద్దల దేవయ్య పరామ ర్శించారు.ఇటీవల రాజేశం గౌడ్‌కి మోకాలి మార్పిడి శస్త్రచికిత్ జరిగింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లిన సుద్దల దేవయ్య ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. రాజేశం గౌడ్ ప్రస్తుతం కోలుకుంటున్న తీరును అడిగి తెలుసుకున్న ఆయనకు ధైర్యం చెప్పి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సుద్దల దేవయ్య గారు మాట్లాడుతూ..."రాజేశం గౌడ్ సీనియర్ నాయకులు. వారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని కోరుకుంటున్నాను. వారు మళ్ళీ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొని మనందరికీ మార్గనిర్దేశం చేయాలి అని ఆకాంక్షి ంచారు.

## కళ్యాణ లక్ష్మి, చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

సారంగాపూర్ ప్రభాతవార్త:

సారంగాపూర్ మండల రైతు వేదికలో మంగళవారము మండలానికి చెందిన 46 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 13 లక్షల 22 వేల రూపాయల విలువ గల చెక్కులను ,46 ఆడబిడ్డలకు మందికి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ద్వారా మంజూరైన 46 లక్షల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సలీం,ఎమ్మార్వో వహీద్,స్తానిక సర్పంచ్ అరుణ శేఖర్,మాజీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, పాక్స్ చైర్మన్ లు నరసింహ రెడ్డి,మల్లారెడ్డి,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు సొల్లు సురేందర్,మండల సర్పంచులు,ఉప సర్పంచులు,అధికారులు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

**-కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ కలెక్టరేట్,ప్రభాతవార్త:**

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు.మంగళవారం కరీంనగర్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ సమావేశం చైర్మన్, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. గర్భస్థ పూర్వ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసీపీఎన్‌డీటీ) అమలుపై సమీక్ష చేపట్టారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్, డీసీపీ వెంకట రమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, వైద్యాధికారులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాలు, ఆస్పత్రులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్య బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, అవసరమైతే పోలీసు శాఖ సహకారంతో పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని సూచించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమనీ,, జిల్లాలో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రజలందరికీ ఈ చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు సంయుక్తంగా స్కానింగ్ సెంటర్లలో తరచూ తనిఖీలు నిర్వహించాలని నిబంధనలు పాటించని కేంద్రాలపై చర్యలు



తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, మహిళా సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో లింగ నిర్ధారణ పరీక్షలు ఎక్కడా జరగకుండా పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించాలని తెలిపారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ మాట్లాడుతూ భ్రూణ హత్యలను పూర్తిగా నివారించడంతో పాటు ఆడపిల్లల పట్ల వివక్షను తగ్గించి, మహిళల హక్కులను పరిరక్షించే దిశగా సమాజంలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని సమర్థవంతంగా అధికారులు అమలు చేయాలని సూచించారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు నుంచి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ సనా,ప్రకృతి, ప్రశాంతి,భువన,ఎన్జీవో ప్రతినిధులు,వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ లేఅవుట్లు

**-ప్రభుత్వ ఆదాయానికి గండి...వసూళ్ల పర్వం కొనసాగుతుంది..?**

**-మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్**

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:**కరీంనగర్ నగర మున్సిపల్ కార్పొరేషన్, శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో అక్రమ లేఅవుట్లు, అవినీతి, ప్రభుత్వ భూముల ఆక్రమణలు పరాకాష్టకు చేరాయని మాజీ మేయర్,58వ డివిజన్ కార్పొరేటర్,బీఆర్ఎస్ నేత సర్దార్ రవీందర్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతో వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ రియల్ ఎస్టేట్ దందా సాగుతోందని ఆయన ఆరోపించారు. మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన అక్రమాలకు సంబంధించిన పలు ఆధారాలను బహిర్గతం చేశారు.ఈ సందర్భంగా రవీందర్ సింగ్ మాట్లాడుతూ నగరంలో నూతనంగా విలీనమైన గ్రామాల్లో అక్రమ లేఅవుట్ల వ్యాపారం జోరుగా సాగుతోందని పేర్కొన్నారు. నెల రోజుల క్రితమే పత్రికల ద్వారా అధికారులను అప్రమత్తం చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని సర్వే నంబర్లు 52, 53, 85, 102, 115 సహా అనేక ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే ఓపెన్ ప్లాట్లు విక్రయిస్తున్నారని, దీనికి సంబంధించిన పూర్తి చిట్టా తమ వద్ద ఉందన్నారు. చింతకుంట ప్రాంతంలోని సర్వే నంబర్ 439లో ఉన్న రెండు ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని అక్రమంగా ప్లాట్లుగా మార్చి మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని తెలిపారు. అల్గునూరు ప్రాంతంలో ల్యాండ్ యూజ్ కన్వర్షన్ (వ్యవసాయేతర భూమి మార్పిడి) లేకుండానే, టౌన్ ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై వ్యవసాయ భూములను కమర్షియల్ ప్లాట్లుగా మార్చి చుట్టూ ప్రహరీ గోడలు కట్టి యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు.నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన లేఅవుట్లలో పార్కులు, రోడ్లు, డ్రైనేజీ, పైప్‌లైన్‌లు వంటి సామాజిక అవసరాల కోసం 10 శాతం ప్రజా అవసరాల భూమి



కేటాయించాల్సి ఉంటుందని ఆయన గుర్తుచేశారు. కానీ సుడా పరిధిలో "గేటెడ్ కమ్యూనిటీ" ల పేరుతో ఈ 10 శాతం భూమిని కేటాయించకుండా, కనీస మౌలిక సదుపాయాలు లేకుండానే అధికారులు అక్రమంగా అనుమతులు మంజూరు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నగరంలో అస్సలు ఒక్కటైనా పూర్తి లీగల్ లేఅవుట్ ఉందా.. అని ఆయన ప్రశ్నించారు.టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి ఏ రేంజ్‌లో ఉందంటే, మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ కంటే అక్కడి అధికారుల సంపాదనే ఎక్కువగా ఉందని రవీందర్ సింగ్ ఎద్దేవా చేశారు. ఇక్కడికి బదిలీపై వచ్చే అధికారులు గోనె సంచులు తెచ్చుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారనీ ఆరోపించారు. అపార్ట్‌మెంట్‌లలో 10 శాతం కంటే ఎక్కువ డివియేషన్ (నిర్మాణ ఉల్లంఘనలు) ఉన్నా భారీ మొత్తాలు వసూలు చేసి ఆక్యుపేషన్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని తెలిపారు.ఆన్‌లైన్‌లో రెండు సార్లు తిరస్కరణకు గురైన ఫైల్.. మూడోసారి డబ్బులు ముడితే ఎలా ఆమోదం పొందుతుందని నిలదీశారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే పేదవారికి వందల నిబంధనలు చెప్పే అధికారులు, కోట్ల రూపాయల అక్రమ నిర్మాణాల ముందు మాత్రం మోకరిల్లుతున్నారని మండిపడ్డారు.రాష్ట్ర మున్సిపల్ శాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెంటనే కరీంనగర్ మున్సిపాలిటీ, సుడా వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు ఆదాయం పెంచే దిశగా కాకుండా, కేవలం బేరసారాలకే పరిమితమయ్యారని విమర్శించారు. నగరంలో ఒక్క ఇంచ్ ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా ఊరుకోమని, బీఆర్ఎస్ పార్టీ తరఫున బాధితుల పక్షాన, ప్రజా ఆస్తుల రక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు.ప్రభుత్వం వెంటనే ఇల్లీగల్ లేఅవుట్లను నిలిపివేసి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ పేర్కొన్నారు.

# పశువుల అక్రమ రవాణాపై నిఘాచెక్ పోస్టుల ఆకస్మికంగా తనిఖీ

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:**

రానున్న బక్రీద్ పండగను పురస్కరించుకుని పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం మంగళవారం కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి మండలం చింతకుంట, గంగాధర మండలం తుర్కాసినగర్, చొప్పదండి మండలంలోని ఆర్నకొండ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్టులను సీపీ స్వయంగా సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

తనిఖీల్లో భాగంగా సీపీ గౌష్ ఆలం చెక్ పోస్టుల గుండా వెళ్లే ప్రతి అనుమానాస్పద వాహనాన్ని, ముఖ్యంగా రవాణా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. చట్టవ్యతిరేకంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చెక్ పోస్టులలో నిర్వహిస్తున్న తనిఖీ రిజిస్టర్‌లను నిశితంగా పరిశీలించి, ప్రతి వాహనం వివరాలను నమోదు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరును గమనించారు. నిరంతరం నిఘా కొనసాగేలా సాంకేతికతను ఉపయోగించుకోవాలన్నారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి కల్పించిన మౌలిక వసతులను సీపీ పరిశీలించారు. ఎండ తీవ్రత దృష్ట్యా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.చట్టాన్ని అతిక్రమించి పశువుల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీపీ స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో సీపీ వెంట ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, రూరల్ ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ప్రదీప్ కుమార్, ఎస్సైలు సాంబమూర్తి,వంశీకృష్ణ, నరేష్ రెడ్డి స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కరీంనగర్ వార్త

## శ్రీరామ్ చక్రవర్తికి బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానం

**కరీంనగర్ లీగల్,ప్రభాతవార్త:**



కరీంనగర్ బార్ అసోసియేషన్ సభ్యుడు న్యాయవాది బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆయన్ని మంగళవారం ఘనంగా సన్మానించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి సిహెచ్ కిరణ్ కుమార్ ల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని అసోసియేషన్ హాల్లో శ్రీరాం చక్రవర్తికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ శ్రీరామ్ చక్రవర్తి తండ్రి బొమ్మ వెంకన్న న్యాయవాదిగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆయన అందించిన సేవల గురించి వివరించారు. శ్రీరామ్ కు చిన్న వయసులో కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడం వెనక తన తండ్రి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు కూడా ఒక కారణంగా తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ కొరకు తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యవర్గం ఆయన్ని శాలువా, మెమెంటులతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయండి

**అధికారులు యుద్ధ ప్రాతిపదికన ప్రక్రియ పూర్తి చేయాలి**

**కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సేకరించి,మిల్లులకు వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరలించిన ధాన్యం మిల్లుల్లో కూడా సత్వరమే అన్లోడింగ్ జరగాలని స్పష్టం చేశారు.మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై పౌరసరఫరాల అధికారులు, తహసీల్దార్లు, మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలు నుంచి మిల్లుల్లో అన్లోడింగ్ వరకు ప్రతి దశలో వేగం పెంచాలని, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్, అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓకే మహేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, పౌరసరఫరాల డిఎం రజనీకాంత్,సహకార అధికారి రామానుజ చార్యులు, డిఆర్డిఓ గీత,జిల్లాస్థాయి అధికారులు, తహసిల్దార్లు,మిల్లర్ల సంఘం నాయకులు,ట్రాన్స్పోర్ట్ ఆపరేటర్లు,తదితరులు పాల్గొన్నారు..



# రైతులు అధైర్యపడవద్దు.. మక్కజొన్నలు చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం..

## ఓడితల ప్రణవ్

### అధికారులు, మార్కెట్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి..





**జమ్మికుంట హుజురాబాద్, ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టించి, పంటలు పండించుకుని ప్రభుత్వంపై నమ్మకంతో మార్కెట్‌కు అమ్ముకోవడానికి వచ్చిన రైతాంగానికి మార్కెట్ పాలకవర్గం, మార్క్‌ఫెడ్ అధికార యంత్రాంగం, మార్కెట్‌లోని కార్మిక యంత్రాంగం అండదండగా నిలవాలని సకాలంలో గన్నీ సంచులు ఇచ్చి, తూకాలు వేసి రైతును సంతోషంగా ఇండ్లకు పంపించాలని, రైతులు ఆందోళన చెందవద్దని పండించిన చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఓడితల ప్రణవ్‌బాబు రైతాంగానికి భరోసా ఇచ్చారు. మంగళవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు సందర్శనకు వచ్చిన ఓడితల ప్రణవ్ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, మార్క్‌ఫెడ్ డిఎం గౌరి నాగేశ్వర్, మార్కెట్ కార్యదర్శి రాజా, అధికారులతో కలిసి గంటపాటు మార్కెట్‌లోని మక్కలు ఆరబెట్టిన ప్రదేశాలను ప్రణవ్‌బాబు నిశితంగా పరిశీలించి రైతులను అడిగి వారం రోజులుగా వారు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రణవ్ బాబు మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అదృష్టవశాత్తు గత సంవత్సరం కంటే ఈ యేడు హుజురాబాద్ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో మక్కజొన్న పంట బాగా పండిందని, కరీంనగర్ పాతజిల్లా పరిధిలో జగిత్యాల, సిరిసిల్ల రాజన్న, పెద్దపల్లి జిల్లాల కంటే కరీంనగర్ జిల్లాలోనే జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో ఇప్పటి వరకు అత్యధిక సంఖ్యలో 85వేల మక్కజొన్న బస్తాలను కొనుగోలు చేయడం జరిగిందని, ఇప్పటికి ఇంకా సుమారు 40వేల బస్తాల వరకు మార్కెట్ యార్డులో ఉన్నాయని, కొన్ని తూకాలు కాగా, మరికొన్ని కావల్సినవి ఉన్నవని, మరికొంత మంది రైతులు, లారీలు సక్రమంగా దొరకక, లారీల రాకకోసం ఎదురుచూస్తున్నారని, గన్నీ సంచుల కొరత ఉన్నప్పటికి ఎప్పటికప్పుడు రైతులకు సరిపడే విధంగా వెసులుబాటు కల్పిస్తున్నామని ప్రణవ్ అన్నారు. మార్క్‌ఫెడ్, మార్కెట్ అధికార యంత్రాంగానికి హమాలీ కార్మికులు ఇలాంటి కష్టసమయాలలో పెద్దమనస్సుతో సహకరించి, రైతాంగాన్ని గట్టెంకించాలని కాంగ్రెస్ నేత ప్రణవ్‌బాబు విజ్ఞప్తి చేసారు. వారం రోజుల క్రితం వచ్చిన రైతులను గుర్తించి వారికి గన్ని సంచులు అందజేసి, సకాలంలో తూకాలు వేసి వారిని ఇండ్లకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని తన దృష్టికి చాలా మంది మహిళ రైతులు, పురుషులు బాధపడుతూ, వెనుకాల వచ్చిన వారికి సంచులు అందజేస్తున్నారని, వారు ఫిర్యాదు చేసినట్లు ప్రణవ్ బాబు పేర్కొన్నారు. మార్కెట్‌కు వచ్చిన తెల్లదుస్సులు వేసుకుని మోతుబారి రైతులకే కాకుండా మట్టి, చెమటతో, మాసిన బట్టలతో మార్కెట్‌లో పడిగాపులు కాస్తున్న రైతులకు వారి పరిస్థితులకు అనుగుణంగా సహకరించాలని ప్రణవ్ బాబు విజ్ఞప్తి చేసారు. రాష్ట్రంలో రైతులు పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులకు రైతులు ఎక్కడ దగా పడకుండా ఎం.ఎస్‌పి రేట్లకు రైతుల నుండి నేరుగా కొనుగోలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటి వరకు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ 36250 క్వింటళ్ల మక్కజొన్నలను రైతుల నుండి మార్క్‌ఫెడ్ నేరుగా కొనుగోలు చేసిందని ఆయన వెల్లడించారు. రానున్న నాలుగు రోజుల్లో ఇక్కడున్న మక్కజొన్న నిల్వలు పూర్తిగా కొనుగోలు చేసి తూకాలు వేసి గోదాంలకు తరలించిన తర్వాత మిగిత మార్కెట్‌కు వచ్చిన మక్కజొన్నలను గింజ మొక్కపోకుండా కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడవద్దని కాంగ్రెస్ నేత ప్రణవ్‌బాబు రైతులకు భరోసా ఇచ్చారు. రేపటి నుండి మార్కెట్ పాలకవర్గ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్కెట్‌కు వచ్చి రైతులను, కార్మికులను సమన్వయం చేస్తూ సకాలంలో కొనుగోలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రణవ్‌బాబు హామీ ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ ఆవరణలోకి రెచ్చగొట్టే రాజకీయ పార్టీల నేతలు ఉత్తర కుమారుల ప్రగల్భాలు పలికి, రైతులను రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలని కాంగ్రెస్ నేత ప్రణవ్ బాబు హితవుపలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు పర్శురాం రావు, సాయిన రవి, దేశిని కోటి, పొనగంటి మల్లయ్య, గూడెపు సారంగపాణి, మొలుగూరి సదయ్య, బాల్సాని రమేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకరి రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, నందమల్ల నరేష్, సందమల్ల బాబు, మార్కెట్ పాలకవర్గ డైరెక్టర్లు, హమాలీ సంఘం నాయకులు, అడ్తిదారుల సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.




## ఉప్పల్ రైతు వేదిక వద్ద రైతుల ఆందోళన

### మొక్కజొన్న కొనుగోళ్లలో అవకతవకలపై ఆగ్రహం



**కమలాపూర్: ప్రభాతవార్త.** మొక్కజొన్న కొనుగోళ్లలో అధికారుల తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉప్పల్ రైతు వేదిక వద్ద ఆందోళనకు దిగారు. మార్కెట్‌లో పైరవీదారులకే పెద్దపీట వేస్తున్నారని, నిజమైన రైతులు నాలుగైదు రోజులుగా పడిగాపులు కాస్తున్నా కొనుగోలు చేయడం లేదని రైతులు మండిపడ్డారు.కమలాపూర్ మండలంలోని అంబాల, శ్రీరాములపల్లి, నేరెళ్ల, మాదన్నపేట, శనిగరం గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో మొక్కజొన్న ధాన్యాన్ని రైతు వేదికలకు తీసుకువచ్చారు. అయితే కొనుగోలు కేంద్ర నిర్వాహకులు నిబంధనలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పైరవీ చేసిన వారి మొక్కజొన్నలను టోకెన్లు లేకపోయినా మొదట కొనుగోలు చేస్తున్నారని, అసలైన రైతుల సరుకు మాత్రం రోజుల తరబడి అక్కడే ఉండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "అధికారులు చెప్పేది ఒకటి, చేసేది మరొకటి. రైతు రాజు అంటారు కానీ ఇక్కడ మాత్రం పైరవీదారులదే పైచేయి" అని రైతులు ఆగ్రహంతో అన్నారు. ఈ క్రమంలో కొనుగోలుదారులతో రైతులకు వాగ్వాదం జరిగింది. "రైతు కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ఇన్ని ఇబ్బందులు పడటం సరికాదు. కొనుగోలు కేంద్రంలో పారదర్శకత పాటించాలి. టోకెన్ విధానాన్ని సక్రమంగా అమలు చేసి, ముందు వచ్చిన రైతు సరుకు ముందు కొనాలి. పైరవీలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే" అని వారు అన్నారు. రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఎండకు, వానకు తట్టుకుని పంటను కాపాడుకుంటున్నామని, కొనుగోలు కేంద్రంలో మాత్రం అన్యాయం జరుగుతోందని రైతులు వాపోయారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి, అవకతవకలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## సమ్మర్ క్యాంప్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

### రాష్ట్రస్థాయి పోటీలలో విజయ ఢంకా మోగించిన ప్రసంగి డ్యాన్స్ స్టూడియో...



**జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:** హన్మకొండలో నిర్వహించిన "డాన్సింగ్ స్టార్స్-2026" రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలలో ప్రసంగి డాన్స్ స్టూడియో ఫిట్నెస్ సెంటర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు విభాగాలలో బహుమతులు సాధించారు. ఈ పోటీలకు ప్రముఖ సీనియర్ కొరియోగ్రాఫర్ మాస్టర్ చరణ్ జడ్జిగా వ్యవహరించగా, ముఖ్య అతిథిగా కుడా (కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) ఛైర్మన్ ఎంగల వెంకట్రామ్‌రెడ్డి హాజరయ్యారు. ప్రసంగి డాన్స్ స్టూడియో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు కేవలం 20 రోజుల పాటు క్రమశిక్షణతో సాధన చేసి రాష్ట్రస్థాయి వేదికపై ప్రతిభ చాటడం విశేషం. చిన్నారులకు నృత్యంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సంస్కృతి వేదికపై ప్రదర్శన నైపుణ్యాలను నేర్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జమ్మికుంటలో చిన్నారుల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రసంగి డాన్స్ స్టూడియో అనేక రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పోటీలలో విజయాలు సాధిస్తూ మంచి గుర్తింపు పొందుతోంది. డాన్స్‌తో పాటు జుంబా, ఫిట్నెస్, ఫోక్, క్లాసికల్ వెస్ట్రన్ డాన్స్‌లలో ప్రత్యేక శిక్షణ అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తోంది.సీనియర్ గ్రూప్ డాన్స్ విభాగంలో అశ్విత్ గ్రూప్ 2వ బహుమతి అందుకుంది. జూనియర్ డ్యూయెట్ డాన్స్ విభాగంలో లియాప్రసంగి నాట్యప్రసంగి జంట 1వ బహుమతి సాధించగా, ప్రకృతి రసజ్ఞ జంట 2వ బహుమతి గెలుచుకుంది.జూనియర్ సోలో డాన్స్ విభాగంలో ప్రకృతి 1వ బహుమతి, రసజ్ఞ 2వ బహుమతి సాధించారు. సీనియర్ సోలో డాన్స్ విభాగంలో లాస్య 2వ బహుమతి అందుకొని ప్రతిభ చాటుకుంది.ఈ విజయానికి శ్రమించిన మాస్టర్లను ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రసంగి డాన్స్ స్టూడియో డైరెక్టర్ శ్రీలత ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారం గురువుల మార్గదర్శకత్వమే ఈ విజయానికి కారణమని ఆమె తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## వర్షాకాలపు సాగు పంటలపై రైతులకు అవగాహన సదస్సు.

**వీణవంక, ప్రభాత వార్త :**




వీణవంక మండల కేంద్రంలో నీ రైతు వేదికలో మంగళ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమములో భాగంగా రాబోయే వర్షాకాలపు సాగు పంటలపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది.దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల ఎ ఆర్ ఎస్ శాస్త్రవేత్త మధుకర్ మాట్లాడుతూ వరి పంట లలో రకాలు,ఎరువుల వాడకం ,పంటల యాజమాన్యం ,పంటలకు రోగాలు,చీడ పీడల నివారణకు విధానాలను వివరించాడు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గణేష్, విస్తరణాధికారి గౌతమి తో పాటు వీణవంక క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

## రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన

**సైదాపూర్, ప్రభాత వార్త:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గల వ్యవసాయ పరిశోధనా స్థానం కరీంనగర్ వారి ఆధ్వర్యంలో రైతులకు మేలైన సాగు పద్ధతులపై మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీజేటీఏయూ వారి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గల వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ వారి ఆధ్వర్యంలో రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు, వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు వ్యవసాయ శాఖ వారితో కలిసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే వినూత్న కార్యక్రమాన్ని ఆకునూర్ గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఏప్రిల్ 27 నుండి మే 23 వరకు కొనసాగే ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా వ్యవసాయ విజ్ఞానాన్ని నేరుగా క్షేత్రస్థాయిలోకి తీసుకు వెళ్లడం జరుగుతుందని, వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఇ. రజనీకాంత్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశంతో పాటు కొన్ని అంశాలైన తక్కువ యూరియా వాడండి సాగు ఖర్చుని తగ్గించండి, పంట వ్యర్థాలు కలియ దున్నడం ద్వారా నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడం, నీటి ఆదా చేయడం పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కలిగించారు. శాస్త్రవేత్త డా. ఇ. ఉమారాణి మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలు సాగు, సేంద్రీయ వ్యవసాయం, పంట మార్పిడి అవసరం మేరకే రసాయన ఎరువుల వాడకం అనే విషయాల పట్ల రైతులకు తెలిపారు. తరువాత ఈనెల రోజుల పాటు జిల్లాలో వివిధ గ్రామాలలో జరిగే ఈ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని, నానో ఎరువుల వాడకం పై మండల వ్యవసాయ అధికారి వైదేహి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వంశీ, రాజు, రజినీకాంత్, తిరుపతి, అభ్యుదయ రైతులు సుమారు 97 మంది పాల్గొని విజయవంతం చేశారు.

# పెద్దపల్లి వార్త



## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 పై అవగాహన సదస్సు

జూలపల్లి,ప్రభాతవార్త:




జూలపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 పై అవగాహన కార్య క్రమం తాహసిల్దార్ దత్తు ప్రసాద్ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిం చారు.ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ జూలపల్లి మండలంలోని ప్రతి ఓటరు 2002 వోటర్ లిస్టు లోని తమ పేరుతో మ్యాపింగ్ చేసుకోవాలని,ఇట్టి మ్యాపింగ్ ప్రక్రియ కాని ఎడల వారి ఓటు తొలగించబడే అవకాశం ఉన్నదని, కావున ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి ఒక్కరు పాల్గొని 100 శాతం ఓటర్లు 2002 ఓటర్ లిస్ట్ తో మ్యాప్ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పద్మజ,నాయబ్ తహసిల్దార్ అనిల్ కుమార్,ఎంపిఓ శేషయ్య సూరి,ఆర్ఐ మల్లికార్జునరావు,జిపిఓ లు,వివిధ గ్రామాల సర్పంచులు,రేషన్ షాప్ డీలర్లు,పంచాయతీ కార్యదర్శులు,మీసేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన తేలుకుంట విద్యార్థికి ఘన సన్మానం

జూలపల్లి,ప్రభాతవార్త:



ప్రతిభకు పట్టాభిషేకం తెలంగాణ శ్రీనివాస సేవాసంస్థ,ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కరీంనగర్ ప్రేరణ రీజియన్ వారిచేత ఉమ్మడి జిల్లా కరీంనగర్ ఎస్ఎస్సి మండల్ టాపర్స్, జిల్లా టాపర్స్ కి ఇందిరా గార్డెన్ కరీంనగర్ లో సన్మానం చేసారు.జూలపల్లి మండలం తేలుకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి లో 560 మార్కులు సాధించిన విద్యార్థి జి.మణిక్రాంత్ని ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రం అందించారు.సన్మాన గ్రహీత జి.మణికాంత్ ని తేలుకుంట గ్రామ సర్పంచ్ నాంపల్లి సంపత్ కుమార్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రవిందర్, ఉపాధ్యాయులు,ఉప సర్పంచ్ దావు సంపత్ రెడ్డి,వార్డు సభ్యులు,యువజన సంఘాల నాయకులు,ఏఏపీసి చైర్మన్,గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

## 23, 24 తేదీల్లో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

### జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

### రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** 23, 24 తేదీల్లో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మంగళవారం అసోసియేషన్ సభ్యులు ఒక ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించారు. జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గోదావరిఖనిలోని ఆర్‌సీఓఏ క్లబ్, సీఈఆర్ క్లబ్బుల్లో రెండు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయని వివరించారు. అండర్11, 13, 15, 17, 19 విభాగాలతో పాటు ఓపెన్ మెన్, ఉమెన్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 35, 40, 45, 50, 55, 60, 65, 70, 75 పైబడిన వయస్సు విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న జిల్లాలోని క్రీడాకారులు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు 9396540067, 9177885183, 9849218365 నెంబర్లను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాటు జిరాక్స్ కాపీ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు కోరారు.

# ఓబీసీ వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తా

### ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



ఓబీసీ వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తా అని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి అన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులైన సందర్భంగా మంగళవారం లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ శ్రేణులు కందుల సంధ్యారాణి ఘనంగా సన్మానించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలలు, శాలువాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ తనపై పార్టీ అధిష్టానం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఓబీసీ వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తానని తెలిపారు. తనకు ఘన స్వాగతం పలికి సన్మానించిన లక్ష్మీ నగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముసుకుల భాస్కర్ రెడ్డి, తడగొండ నరసయ్య, సులువ లక్ష్మీనారాయణ, కోడూరు రమేష్, బియ్యాల మహేందర్, మాదరబోయిన రాకేష్, అందే రాజ్ కుమార్ చారి, సిలారపు కళ్యాణ్, మీస వికాస్, నగునూరి లక్ష్మీనారాయణ, కొమ్మ స్వామి, తడగొండ కార్తీక్, జనగామ సాగర్, వీరబోయిన శ్రీనివాస్, వంశీ, వెంకటేష్ పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారు జాగ్రత్త

### పెద్దపల్లి టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్

పెద్దపల్లి, ప్రభాతవార్త:



వేసవి సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేవారు విలువైన వస్తువులపై జాగ్రత్త వహించాలని పెద్దపల్లి టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ హెచ్చరించారు. మంగళవారం పెద్దపల్లి పట్టణ ప్రజలను దొంగతనాల పట్ల అప్రమత్తం చేసేందుకు టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ మాట్లాడుతూ ఎండల తీవ్రత వల్ల రాత్రి వేళల్లో ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి డాబాలపై లేదా ఆరుబయట పడుకుంటే దొంగలు ఇళ్లలోకి చొరబడే ప్రమాదం ఉందన్నారు. అందుకే సురక్షితంగా ఇళ్లలోనే నిద్రించాలని కోరారు. ఊర్లకు వెళ్లేవారు తమ బంగారు నగలు, నగదును ఇళ్లలో ఉంచకుండా జాగ్రత్తపడాలన్నారు. కాలనీల్లో సంచరించే గుర్తుతెలియని అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు అందించి దొంగతనాల నివారణకు సహకరించాలని కోరారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత మహిళల బోనాలను అడ్డుకున్న గౌడ కులస్తులు

### -బోనాలతో రోడ్డుపై బైఠాయించిన దళిత మహిళలు

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:





రేణుక ఎల్లమ్మ దేవాలయంలోకి బోనాలను తీసుకురాకుండా గౌడ సంఘం నాయకులు అడ్డుకోవడంతో దళిత సంఘాల నాయకులు మహిళలు బోనాలతో మంగళవారం రోడ్డుపై బైఠాయించిన సంఘటన చోటు చేసుకుంది గ్రామస్తులు దళిత సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెగడపల్లి లో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు గౌడ కులస్తుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి మంగళవారం ఉదయం గౌడ కులస్తుల మహిళలు బోనాలతో రేణుక ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లి నైవిద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు అనంతరం దళిత మహిళలు బోనాలతో రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్దకు నైవేద్యం మొక్కులు సమర్పించడానికి వెళ్లగా కొంతమంది గౌడ కులస్తులు మొక్కులు చెల్లించకుండా అడ్డుకోవడంతో దళిత మహిళలు బోనాలతో సుల్తానాబాద్ శ్రీరాంపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు విషయం తెలుసుకున్న స్థానిక తాసిల్దార్ రాపల్లి రాముడు ,ఎస్సై వెంకటేష్ సంఘటన స్థలానికి వెళ్లి ఉన్నత అధికారులకు సమాచారం అందించారు సంఘటన స్థలానికి డీసీపీ భూక్య రామ్ రెడ్డి సీఐ లు రంజిత్ రావు, ప్రవీణ్ లు చేరుకుని ఇరువర్గాలను శాంతిం పజేశారు దళితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన అవసరం

### జాతీయ హరిత దళం జిల్లా కోఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్

### పర్యావరణ అవగాహన వేసవి శిబిరం నిర్వహణ



**పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:** పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత అని జాతీయ హరిత దళం (ఎన్జీసీ) జిల్లా కోఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల వేసవి శిబిరంలో తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ హరిత దళం (ఎన్జీసీ) సహకారంతో 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో లక్ష్యంతో కూడిన వేసవి శిబిరం ఘనంగా నిర్వహించారు. రక్షించడం సంరక్షించడం ప్రోత్సహించడం అనే నినా దంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్థానిక పర్యా వరణ సమస్యలపై చర్చలు నిర్వహించారు. ఉపరితల మరియు భూగర్భ జలాల కొరత, జల వనరుల కాలుష్యం, గాలి కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ సమ స్యలు, ప్లాస్టిక్ కాలుష్యం, పరి శుభ్రత లోపం, పచ్చదనం తగ్గిపోవడం వంటి అంశా లపై జాతీయ హరిత దళం (ఎన్జీసీ) జిల్లా కోఆరి నేటర్ గూళ్ళ అంజన్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు స్కిట్స్, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించగా, యోగా మరియు డ్రాయింగ్ పోటీలు కూడా ఏర్పాటు చేశారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు జిల్లా విద్యాధికారి జి. శారద సర్టిఫికెట్లు అంద జేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.ఎం. షేక్, వేసవి శిబిరం పీఎం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అప్పన్నపేట ప్రధానో పాధ్యాయులు పురుషోత్తం, జీవశాస్త్ర ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేందర్, వంగ అశోక్ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో తాము భాగస్వాములు అవుతామని ప్రతిజ్ఞ చేశారు.

# చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన కమీషనర్ గౌస్ ఆలం

గంగాధర,ప్రభాత వార్త :

బక్రీద్ పండుగ సందర్భంగా అక్రమంగా ఆవులు, ఇతర నిషేధిత జంతువుల తరలింపును అరికట్టేందుకు గంగాధర మండలంలోని మంగపేట వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను కరీంనగర్ కమిషనర్ గౌస్ ఆలం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద చేపడుతున్న తనిఖీలను కమిషనర్ సమీక్షించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని అక్రమ రవాణా ద్వారా ఆవులు,ఇతర నిషేధిత జంతువులను మాంసం విక్రయ కేంద్రాలకు తరలించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, సరిహద్దు ప్రాంతాలు, గ్రామీణ మార్గాలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కమిషనర్ పలు



కీలక సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువులను తరలించే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా జంతువుల రవాణా జరిగితే వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, చెక్‌పోస్ట్ వద్ద సీసీ కెమెరాలు, లైటింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అనుమానాస్పద వాహనాల కదలికలపై నిఘా కొనసాగించాలని ఆదేశించారు. జంతు అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని కమిషనర్ గౌస్ ఆలం పేర్కొన్నారు. అనుమానాస్పదంగా పశువులను తరలిస్తున్న వాహనాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. కరీంనగర్ రూరల్ ఏ సీ పి విజయ్ కుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చొప్పదండి వార్త

## కొండగట్టు అంజన్న ఆలయంకు పోటెత్తిన భక్తులు

మల్యాల/ ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు, వేకువ జాము నుండే వివిధ ప్రాంతాల నుండి భక్తులు కొండపైకి చేరుకోవడంతో ఆలయ పరిసరాలన్నీ రద్దీగా మారాయి, శ్రీ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు కోనేరులో స్నానమాచరించి అనంతరం క్యూ లైన్లలో బారులు తీరారు, వేసవి



సెలవులు కావడంతో అనేకమంది తమ పిల్లలతో వాహనాలలో కొండగట్టుకు తరలి రావడం వల్ల పార్కింగ్ ఇబ్బందులు తప్పలేదు, అటు ఆలయంలో కూడా పెద్ద ఎత్తున భక్తులు రావడంతో క్యూ లైన్లు నిండిపోయి శ్రీ స్వామివారి దర్శనానికి అరగంటకు పైగా పట్టింది, ప్రసాదాల కౌంటర్ల వద్ద కూడా రద్దీ నెలకొంది,అనంతరం శ్రీ బేతాళస్వామి ఆలయంలో కూడా స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు, కాగా అవుట్ పోస్ట్ ఏ ఎస్ ఐ చిలుక శ్రీనివాస్ ఆధ్వర్యంలో రద్దీగా మారిన వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రించారు,

## అంజన్న సేవలో జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి , డి ఆర్ డి ఓ

మల్యాల/ ప్రభాతవార్త





జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని మంగళవారం పలువురు అధికారులు దర్శించుకున్నారు, ఈ సందర్భంగా జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జి కం అసిస్టెంట్ సెషన్ జడ్జి డి నాగేశ్వరరావు దర్శించుకున్నారు, అదేవిధంగా జగిత్యాల డిఆర్డిఓ రఘువరన్ కూడా తమ కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టుకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రం కప్పి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు, కార్యక్రమంలో టెంపుల్ సూప రెండెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ తూము శ్రీనివాస్, సత్యం తోపాటు ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు

## చెక్ పోస్ట్ ను తనిఖీ చేసిన తహసీల్దార్ నవీన్ కుమార్

చొప్పదండి,ప్రభాతవార్త:

చొప్పదండి మండలంలోని రైస్ మిల్లర్ల కు లారీలను పంపడానికి తీగలగుట్టపల్లి లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను చొప్పదండి తహసిల్దార్ పి. నవీన్ కుమార్ మంగళవారం తనిఖీ నిర్వహించారు. లారీలను, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తరలించుట కై సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిదవార్లు టి. త్రిపాల్ సింగ్, ఎం డి రహీం, జి పి ఒ లు వీరేందర్, శ్రీనివాస్, రమేశ్, తిరుపతి, రాజకుమార్, జెట్టి శ్రీనివాస్ తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



## టి ఆర్ ఎస్ పార్టీ కోసం రక్షకుల్లా పని చేయాలి

**వ్యవస్థాపక అధ్యక్షులు కవిత**

చొప్పదండి,ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర ప్రజల భద్రత, అభివృద్ధి కోసం ఏర్పడిన తెలంగాణ రక్షణ సేన (టి ఆర్ ఎస్) పటిష్టత కై రక్షకుల్లా పని చేయాలని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత కోరారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి కలిసి నూతన పార్టీ ఆవిర్భావం తో కవిత కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి ని కవిత ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వం లోనే రాష్ట్ర అభివృద్ధి

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

చొప్పదండి,ప్రభాతవార్త:



రాష్ట్రం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వం లోని ప్రజా పాలన ప్రభుత్వం తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం చొప్పదండి పట్టణం లోని బి సి కాలనీ లో పద్మశాలి సంఘం భవన ప్రహారీ గోడ నిర్మాణం కు 5 లక్షల రూపాయల ప్రొసీడింగ్ ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండగట్టు ఉత్సవ కమిటి చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కౌన్సిలర్లు వడ్లూరి అనూష శ్యాంసుందర్, కొట్టె సునీత అశోక్ తో పాటు బి సి కాలనీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

మల్యాల / ప్రభాతవార్త

మల్యాల మేజర్ గ్రామపంచాయతీ 16 వార్డు సభ్యులు గాండ్ల జ్యోతి వేణు మంగళవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు, ఈ మేరకు వారు కరీంనగర్ డిసిసి అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువా తో పార్టీలోకి ఆహ్వానించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బి, ఆర్, ఎస్, బిజెపి ల నుండి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే సత్యం పేర్కొన్నారు,



# మిల్లుల వద్దే నిలిచిపోయిన రైతుల ధాన్యం.. మూడు రోజులుగా పడిగాపులు

సొంత ట్రాక్టర్లతో మిల్లుకు తరలించిన ధాన్యం

దిగుమతి లేక రైతుల ఆందోళన

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:





వేములవాడ రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ సొంత ట్రాక్టర్లలో ధాన్యాన్ని మిల్లులకు తరలించగా, మర్రిపల్లి గ్రామంలో ఉన్న రైస్‌మిల్ వద్ద గత మూడు రోజులుగా ధాన్యం పడిగాపులుగా నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. దిగుమతి ప్రక్రియ ఆలస్యం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు మరియు మిల్లుల మధ్య సరైన సమన్వయం లేకపోవడం, సిబ్బంది కొరత, తూకం ప్రక్రియలో జాప్యం, ధాన్యం దిగుమతికి అవసరమైన చర్యలు ఆలస్యమవడం వల్ల ఈ సమస్య తలెత్తినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్లతో నిండిన ట్రాక్టర్లు క్యూలలోనే నిలిచిపోవడంతో రైతులు ఎండలోనే రోజులు గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. దూర గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఆహారం, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రైతులు రాత్రిళ్లు కూడా ట్రాక్టర్ల వద్దే కాపలా కాస్తూ ఉండాల్సి వస్తోందని తెలిపారు. ఎండ వేడి తీవ్రంగా ఉండటంతో ట్రాక్టర్లలో ఉన్న ధాన్యం నాణ్యత దెబ్బతింటుందేమోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. రోజూ మిల్లుల వద్దే ఉండి తమ ధాన్యం దిగుమతి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి రైతులకు భారంగా మారింది. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని కొనుగోలు మరియు దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని, అదనపు సిబ్బందిని నియమించి ట్రాక్టర్లను త్వరగా ఖాళీ చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, మర్రిపల్లి రైస్‌మిల్ వద్ద నిలిచిపోయిన ధాన్యాన్ని తక్షణమే దిగుమతి చేయించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతుల కష్టాన్ని గుర్తించి తక్షణ ఉపశమనం కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.




## విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన రూరల్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:



వేములవాడ రూరల్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సోయినేని కరుణాకర్, ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, మండలంలో పార్టీని మరింత బలపరిచేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. కరుణాకర్ మాట్లాడుతూ, వేములవాడ రూరల్ మండలంలోని ప్రతి గ్రామానికి చేరుకుని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తానన్నారు. సీనియర్ నాయకుల అనుభవం, యువత ఉత్సాహం, కార్యకర్తల శ్రమ ఈ మూడింటి సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేస్తానని చెప్పారు. గ్రామస్థాయిలో సమావేశాలు, బూత్ స్థాయి కమిటీలు, యువజన మరియు మహిళా విభాగాల సమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ పార్టీ ప్రజల మధ్య ఉండేలా కార్యాచరణ రూపొందిస్తానని వివరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తానని, ఈ బాధ్యతను సేవగా భావిస్తున్నానని కరుణాకర్ పేర్కొన్నారు. తనకు అవకాశం కల్పించిన నాయకత్వానికి, సహకరించిన కార్యకర్తలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సుందరయ్య ఆశయ సాధనకు కార్మికుల పోరాటం కొనసాగాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటిఎల్లారెడ్డి

తెలంగాణ చౌక్ లో సుందరయ్య 41 వర్ధంతి వేడుకలు

వేములవాడ టౌన్ ప్రభాతవార్త:

బడుగు బలహీన వర్గాల కోసం పుచ్చలపల్లి సుందరయ్య చేసిన కృషి ఎంతో ఉన్నదని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు వేములవాడ సిఐటియు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని మంగళవారం వేములవాడ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగ్మంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, కష్టజీవుల హక్కుల కోసం జీవితాంతం పోరాడారని తెలిపారు. కార్మికులకు సరైన వేతనాలు, కనీస వేతనాల అమలు, కార్మిక చట్టాల పరిరక్షణలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సీఐటీయూ తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల సాధన కోసం



అనేక పోరాటాలు కొనసాగుతున్నాయని, సుందరయ్య ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం అశోక్, సీపీఎం వేములవాడ పట్టణ కార్యదర్శి ముక్తికాంతం అశోక్, ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లారపు ప్రశాంత్ కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు హనుమంతు, సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నాయకులు సావనపల్లి శ్రీనివాస్, కీసర శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్, బొడ్డు శ్రీనివాస్, పిట్టల శంకర్, సీహెచ్ అనిల్, నిమ్మచెట్టి రాజశేఖర్, జంగా రాజు తదితరులు పాల్గొన్నారు.

## లింగంపేటలో చార్వాక వృద్ధుల రిలే నిరాహార దీక్షలు

చందుర్తి / ప్రభాతవార్త:



చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘం స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ చార్వాక వృద్ధుల సంఘం నాయకులు మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు , ఈ సందర్భంగా చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు దప్పుల అశోక్ మాట్లాడుతూ చార్వక ఆశ్రమ స్థలంలో సబ్ స్టేషన్ వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు, చార్వాక వృద్ధాశ్రమానికి ఎదురుగా సబ్ స్టేషన్ నిర్మించడం వల్ల వృద్ధులకు ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు అభివృద్ధికి తాము అడ్డు కాదని గ్రామపంచాయతీ తీర్మానం చేసే స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలన్నారు, మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు వృద్ధుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. 20వేల మంది వృద్ధుల ఆత్మగౌరవానికి ప్రతీక చార్వక ఫౌండేషన్ అన్నారు, వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సబ్ స్టేషన్ నిర్మాణాన్ని మార్చాలని అధికారులను కోరారు, ఈ కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు వుచ్చిడి రాజిరెడ్డి, జిల్లా కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్ రావు ఇందూరి రాములు , కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇందూరి హనుమాడ్లు, కాటిపల్లి రాజిరెడ్డి, ఎండి, హైద.ర్ ఎన్నం లింగయ్య, ఎర్ర ఆశన్న, కొట్టే లింగన్న, దయ్యాల కమలాకర్, మారుపాక శ్రీనివాస్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రజలకు వైద్య పరీక్షలు

రుద్రంగి ప్రభాత వార్త :



జన జాతీయ గరిమ ఉత్తవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రుద్రంగి మండలంలోని గిరిజనతండా గ్రామాల్లో వైద్యాధికారులు, గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మెరుగైన వైస్యేవలను అందించేందుకు, గిరిజనుల ఆరోగ్య సంరక్షణకు జన జాతీయ గరిమ ఉత్తవ్ కార్యక్రమం ఏర్పాటు చేసి వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరిజనతండాల్లోని ప్రజలకు జనరల్ హెల్త్ చెకప్, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు, రక్త హీనత వంటి పరీక్షలు నిర్వహించిమందులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ శ్యామల, సర్పంచ్లు మాలోత్ రాందాస్, దేగావత్ సరిత, నరహరినాయక్, వైద్యాధికారులు రేణుక, హెచ్ఎస్ కౌసల్య, ఎంఎలెచ్పీలు లక్ష్మీప్రసన్న, అర్చన, నవ్య, ఎఎన్ఎంలు కృష్ణవేణి, కవిత, రజిత, రాజేశ్వరి, విజయ, ఏఎన్ఎంలుకృష్ణవేణి, కవిత, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువతరం సుందరయ్య మార్గాన్ని అనుసరించాలి

**ప్రభాతవార్త కోనరావుపేట:** పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) కోనరావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘన నివాళి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ, సుందరయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఆయన సమర్థ నాయకత్వం వహించారని



గుర్తుచేశారు. యువతరం సుందరయ్య నిబద్ధత, త్యాగం, ప్రజాసేవా భావాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జవ్వాజీ విమల, మల్లారపు అరుణ్ కుమార్, మనోజ్ కుమార్, రేణుక, షబ్బీర్, తిరుపతి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న బండపల్లి సర్పంచ్

-ఆడపిల్లల పెళ్లికి 5016 ఆర్థిక సహాయం

చందుర్తి / ప్రభాతవార్త:

చందుర్తి మండలం బండపల్లి గ్రామ సర్పంచ్ కటుకం మల్లేశం సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో ఆడపిల్లల పెళ్లి జరుగుతే 5016ల ఆర్థిక సహాయం చేస్తానని ఇచ్చిన హామీ మేరకు గ్రామానికి చెందిన షాదుల్లా షాహిదా ల కూతురు వివాహానికి మంగళవారం 5016 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు, సందర్భంగా



సర్పంచ్ మల్లేశం మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఆడపిల్ల వివాహానికి 5016 ఆర్థిక సాయం అందజేస్తానని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లపు ఇసాక్ నాయకులు లింగంపల్లి బాబు, మహమ్మద్ అజీమ్, కుమ్మరి లచ్చయ్య, అన్వర్, రాజిరెడ్డి, శేఖర్, హన్మంత్, గడ్డ అనిల్ పంచాయతీ కార్యదర్శి పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

# మహిళపై దాడి చేసిన సర్పంచ్ మేడ రాజయ్యపై చర్య తీసుకోవాలి



మంథని ప్రభాతవార్త:
మంథని మండలం గోపాలపూర్ సర్పంచ్ మేడ రాజయ్య తనపై దాడికి పాల్పడ్డాడని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలు మేడ విజయ మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన అత్తమామలు సంపాదించిన వ్యవసాయ భూమికి సంబంధించి కొంతకాలంగా వివాదం కొనసాగుతోందని, ఈ విషయమై మంథని కోర్టులో కేసు కూడా నడుస్తోందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని గోపాలపూర్ గ్రామ సర్పంచ్ మేడ రాజయ్య తనపై కక్ష పెంచుకున్నాడని ఆరోపించింది. తాను ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో మేడ రాజయ్య తన ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ ఇంట్లోకి ప్రవేశించాడని తెలిపింది. అనంతరం తన వెంట తెచ్చుకున్న కర్రతో దాడి చేసి ఎడమ భుజం, ఎడమ చేతి భాగం, పక్కటెముకల వద్ద గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాకుండా గొంతు పట్టుకుని చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపించింది. అడ్డు వచ్చిన వారిపైనా మేడ రాజయ్య, అతని భార్య ఓదమ్మ, కుమారుడు సత్యనారాయణ దుర్భాషలాడుతూ దాడికి దిగేందుకు ప్రయత్నించినట్లు బాధితురాలు తెలిపింది. తనపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితురాలు మంథని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మార్కెట్ కమిటీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం

మంథని ప్రభాతవార్త:
మంథని మార్కెట్ కమిటీ లో అవుట్సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యంతో విధులు నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మార్కెట్ కమిటీలో ఎనిమిది మంది ఉద్యోగులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. వీరిలో కేవలం ముగ్గురు, నలుగురు మాత్రమే రెగ్యులర్గా కార్యాలయానికి వచ్చి తమ విధులను నిర్వహిస్తున్నారు. మిగిలిన వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది సిబ్బంది కరీంనగర్ నుండి వారికి ఇష్టం వచ్చినప్పుడు వచ్చి విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇన్చార్జిగా ఉండటంతో కింది స్థాయి సిబ్బంది తమ ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. కొంత మంది సిబ్బంది కార్యదర్శికి దగ్గరగా ఉంటూ తమతోటి సిబ్బందిపైనే పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్ కమిటీ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన హాజరు పట్టిక లేకపోవటంతో ఎవరు ఎప్పుడు వస్తున్నారు తెలియడం లేదు. ప్రస్తుతం వరి ధాన్య కొనుగోలు నడుస్తున్న సమయంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించక పోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం పైన ఉన్నత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం
### -డిఎంఒ ప్రవీణ్ రెడ్డి

మంథని మార్కెట్ కమిటీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారి పైన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల విధుల నిర్లక్ష్యంపై డిఎంఒను వివరణ అడగగా మంథని మార్కెట్ కమిటీలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి అటెండెన్స్ రిజిస్టర్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించే వారి పైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# మంథని వార్త

## ధాన్యం తరలింపులో ఇబ్బందులు సృష్టిస్తున్న లారీ యజమానులు
### -మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న

మంథని ప్రభాతవార్త:



మంథని మార్కెట్ కమిటీ లో వరి ధాన్య కొనుగోలు కేంద్రం నుండి ధాన్యాన్ని తరలించడానికి లారీ అసోసియేషన్ వారు అనేక ఇబ్బందులు సృష్టిస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న ఆరోపించారు. మంథని ప్రాంతానికి ధాన్యం తరలించడానికి 80 లారీలను ఏర్పాటు చేస్తామని లారీ అసోసియేషన్ వారు కేవలం 20 లారీ లను మాత్రమే పెట్టి ధాన్యం తరలింపులో ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆయన అన్నారు. లారీ యజమానులు ధాన్యం తలలింపులో చేస్తున్న జాప్యాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు. అదేవిధంగా లారీ అసోసియేషన్ యజమాన్యం ధాన్యం తరలింపులో చూపెడుతున్న నిర్లక్ష్యం పైన మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు. రెండు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించే విధంగా జిల్లా కలెక్టర్ తో కలిసి చర్యలు తీసుకుంటామని రైతులు అధైర్య పడవద్దని ఆయన తెలిపారు .

## బ్రహ్మణ సంక్షేమ పరిషత్‌లో చోటు కల్పించాలని మంత్రికి వినతి

రామగిరి ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తులో శ్రీ వైష్ణవులకు ఐదుగురు డైరెక్టర్గా చోటు కల్పించాలని శ్రీ వైష్ణవ సేవా సంఘం రాష్ట్ర బాధ్యులు మంగళవారం హైదరాబాదులోని మంత్రి శ్రీధర్ బాబు ను మాజీ కేంద్ర మంత్రి వేణు గోపాల్ కి వినతి పత్రం అందజేశారు ఎన్నాళ్లుగానో శ్రీవైష్ణవ కులస్తులు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని ఏ ప్రభుత్వంలోనైనా బ్రాహ్మణ పరిషత్ లో వైష్ణవులకు చోటు కల్పించలేదని వాపోయారు.దేవాదాయ శాఖపరిధిలో తాత్కాలికంగా పనిచేస్తున్న అర్చకులను రెగ్యులైజేషన్ చేయాలని కోరారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో శ్రీ వైష్ణవ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి పీచకృష్ణమాచార్యులు గోవర్ధనగిరిజగన్నాథచార్యులు ,రాష్ట్ర యువజన కార్యదర్శి గోవర్ధనగిరి ధీరజ్ కృష్ణమాచార్యులు ఉన్నారు.

## చేయూత పెన్షన్ల అతంటికేషన్
### పరిశీలించిన సర్పంచ్
### ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

రామగిరి ప్రభాతవార్త:



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో చేయూత పెన్షన్ల అతంటికేషన్ను మంగళవారం సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పరిశీలించారు. గ్రామంలోని చేయూత పెన్షన్ తీసుకుంటున్న వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు చేయూత పెన్షన్ (గతంలో ఆసరా) పింఛను లబ్ధిదారుల కోసం తప్పనిసరి అయిన ప్రత్యక్ష గుర్తింపు, ముఖ ధ్రువీకరణ ప్రక్రియ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. రత్నాపూర్ గ్రామపం చాయతీ కార్యాలయంలో పెన్షన్ దారుని ఫేస్ అతెంటికేషన్ ప్రాసెస్ జరుగు తుందని తెలిపారు. ప్రస్తుతం పెన్షన్ పొందుతున్న పెన్షన్ దారులందరి ఆధార్ కార్డు,ఐరిష్,ఫేస్ రికగ్నేషన్ ఫోటోలను సెక్రటరీ గంగుల. సంతోష్ తీసుకుంటున్నాడు. గ్రామంలో సుమారు 350 పెన్షన్ దారులు ఉన్నారని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు తెలిపారు.

## సరస్వతి అంత్య పుష్కరాలకు మంథని బస్టాండ్ నుండి ప్రత్యేక బస్సులు

మంథని ప్రభాతవార్త:



ఈనెల 21 నుండి జూన్ 1 వరకు కాళేశ్వరంలో జరిగే సరస్వతి అంత్య పుష్కరాలకు మంథని బస్టాండ్ నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు మంథని డిపో మేనేజర్ వి. శ్రవణ్ కుమార్ తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులలో కరీంనగర్ నుండి కాళేశ్వరం కు ఫుల్ టికెట్ రూ.290 హాఫ్ టికెట్ రూ.150 అదే విధంగా మంథని నుండి కాళేశ్వరం కు ఫుల్ టికెట్ రూ.140 హాఫ్ టికెట్ రూ.80 ఉంటుందన్నారు. ఈ ప్రత్యేక బస్సులలో మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని తెలిపారు. కావున మంథని పరిసర ప్రాంత ప్రజలు ఇట్టి అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆయన కోరారు.

## కార్మికుల ఉపాధి ఆరోగ్య పరిరక్షణపై పరిశీలన

రామగిరి ప్రభాతవార్త:



సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు మరియు పర్మనెంట్ కార్మికుల ఒప్పందాలు పని ప్రదేశాలు రక్షణ సౌకర్యాల పరిస్థితి పై లండన్ రివర్స్ స్కాలర్ హేమ వైష్ణవి మంగళవారం పరిశీలించారు. రామగుండం ఆర్ జి త్రీ ఎస్ఎంఎస్ ప్లాంట్ వద్ద కాంట్రాక్టు కార్మికులతో కలిసి వారి యొక్క పని పద్ధతులు రక్షణ పద్ధతులు వేతనాలు వైద్యం తదితర సమస్యలపై కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హేమ వైష్ణవి మాట్లాడుతూ కార్మికుల జీవన పరిస్థితులు, ఉపాధి భద్రత, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై సమగ్ర అధ్యయనం చేపడుతున్నట్లు తెలిపారు. సింగరేణి ప్రాంతంలో కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నమోదుచేసి సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. అశోక్, బి. శ్రీనివాస్, రాజన్న, సంపత్, భూమయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ రంగాన్ని ఇబ్బంది పెడుతున్న జీ.ఎస్.ఆర్ 220 ఈని రద్దు చేయాలి
### కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్
### మండల అధ్యక్షుడు గడ్డం శ్రీధర్
### సమ్మెకు సహకరించాలని తహశీల్దార్, ఎస్.ఐలకు
### కరపత్రాల అందజేత

ముత్తారం, ప్రభాతవార్త:



ఫార్మసీ రంగాన్ని ఇబ్బంది పెడుతున్న జీ.ఎస్.ఆర్ 220 ఈని రద్దు చేయాలని కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీధర్, ప్రధానకార్యదర్శి కాసు తిరుపతి డిమాండ్ చేశారు. ఫార్మసీ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న సమస్యలపై నేడు దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్ సభ్యులు సమ్మెకు సహకరించాలని మండల అధికారులను కోరారు. ఇందులో భాగంగానే బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని ముత్తారం తహశీల్దార్ మధుసూదన్ రెడ్డికి, ఎస్.ఐ రవికుమార్‌కు అందజేసి సమ్మెకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీధర్ మాట్లాడుతూ దేశంలో ఫార్మసీ రంగాన్ని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న కీలక సమస్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తులు చేసినట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే సమ్మెకు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్ జీఎస్ఆర్ 220 ఈని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ దేశవ్యాప్త 1 రోజు సమ్మెకు తమ అసోసియేషన్ తరపున సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కెవి చారి, ముస్కు సదానందం, వేముల హుస్సేన్, నిమ్మతి రాజేందర్, సంపూర్ణ చారి, జంగ రవికుమార్ సభ్యులు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసిన వరి ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

పెగడపల్లి, ప్రభాతవార్త:

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని నంచర్ల, దేవి కొండ, రాం నగర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూకొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి, మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిరక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వాలు మరియు మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు



ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. రైస్ మిల్లులలో ధాన్యం నిల్వాలు, మిల్లింగ్ ప్రక్రియ, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులను, మిల్లర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, డి సి ఎస్ ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్, నిజాముద్దీన్, ఎంపీడీవో శశి కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు గౌడ్, నంచర్ల సహకార సంఘం సీఈవో రైతు మధుకర్, సర్పంచ్ ఆమిరిశెట్టి లక్షీ ్మనారాయణ,, అధి తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలు కేంద్రంలో రైతుల అవస్థలు

బార్దాన్, లారీలు, హమాలీల కొరతతో తీవ్ర ఇబ్బందులు

కనీస వసతులు లేక ఎండలోనే రైతుల నిరీక్షణ

గొల్లపల్లి, ప్రభాతవార్త:





డీసీఎంఎస్ ఆధ్వర్యంలో గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మక్కల కొనుగోలు కేంద్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు మండలాలకు చెందిన రైతులు తమ మక్కలను కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తుండగా, సరైన సౌకర్యాలు లేక రోజులు తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండాకాలం తీవ్రంగా ఉండటంతో రైతులు ఎండలోనే ఉండాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రంలో కనీసం త్రాగునీటి సౌకర్యం, నీడ ఏర్పాట్లు లేకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సి రావడంతో రోజుకు వందల రూపాయలు ఖర్చవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు వడదెబ్బ గురైతే అయితే దానికి బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. మక్కలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన తర్వాత కూడా బార్దాన్ కొరత కారణంగా రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు హమాలీల కొరత, మరోవైపు లారీల కొరత కారణంగా తూకం వేసిన మక్కలను సైతం తరలించలేకపోతున్నారని తెలిపారు. కొంతమంది రైతులు సొంత ట్రాక్టర్లలో మక్కలను గోదాముల వరకు తీసుకెళ్లినా అక్కడ కూడా దిగుమతి చేయకపోవడంతో ట్రాక్టర్లతోనే నిరీక్షి ంచాల్సి వస్తోందని వాపోయారు. మక్కలు పోసేందుకు సరైన స్థలం లేకపోవడంతో జగిత్యాల ధర్మారం ప్రధాన రహదారి పక్కనే గొల్లపల్లి మండల కేంద్రంలో మక్కల కుప్పలు వేయాల్సి వస్తోందన్నారు. ఇటీవల మక్కల కుప్పపైకి లారీ ఎక్కడంతో అగ్గిమల్ల గ్రామానికి చెందిన రైతు తీవ్రంగా గాయపడి కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు ఇదే ఆదనుగా రైతుమక్కలను కొంత మంది దొంగలు ఎత్తుకెళ్లినట్టు తెలిసింది ఘటన రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. అదేవిధంగా అమాలి చార్జీలు, ఇతర చార్జీల పేరుతో క్వింటాల్‌కు రూ. 92 వరకు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారి పక్కన తూకం వేసిన మక్కల బస్తాలు లారీలు రాక అలాగే ఉండిపోవడంతో వాహన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### బార్దాన్ కోసం రోడ్డెక్కిన రైతులు

బార్దాన్ అందించడంలో జాప్యం జరుగుతుండటంతో మంగళవారం ఉదయం రైతులు జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపై ట్రాక్టర్లు అడ్డంగా పెట్టి నిరసన వ్యక్తం చేశారు. రోజుల తరబడి ఎదురుచూస్తున్నప్పటికీ సీరియల్ ప్రకారం బార్దాన్ ఇవ్వకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. పోలీసులు వచ్చి రైతులకు నచ్చచెప్పి ట్రాక్టర్ తొలగించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి బార్దాన్ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు తూకం ప్రక్రియ వేగవంతం చేసి ట్రాన్స్‌పోర్ట్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



200 బస్తాల మక్కలను తూకం వేసి ఇప్పటికే తొమ్మిది రోజులు గడిచినా ఇప్పటికీ లారీలు రాలేదు. దీంతో బస్తాలు రోడ్డు పక్కనే అలాగే ఉన్నాయి. దీనివల్ల వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి లారీలు పంపించి మక్కల బస్తాలను తొందరగా తరలించేలా చర్యలు తీసుకోవాలి

**-అడుప తిరుపతి, రైతు**

## ఇద్దరి మృతికి కారణమైన యువకుడు రిమాండ్

గొల్లపల్లి, ప్రభాతవార్త:

మద్యం మత్తులో అతివేగంగా, అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడిపి ఇద్దరి మృతికి కారణమైన గొల్లపల్లి మండలంలోని రంగధాముని పల్లి గ్రామానికి చెందిన నర్రా పవన్‌ను ధర్మపురి సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మార్చి 29వ తేదీ ఉదయం సుమారు 4 గంటల సమయంలో గుంజపడుగు గ్రామానికి చెందిన పురాణం లస్మక్క (63), మోతే పోషవ్వ (65) భిక్షాటన నిమిత్తం జగిత్యాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామ శివారులో కి చేరుకోగానే రంగదాముని పల్లి గ్రామానికి చెందిన నర్రా పవన్ తన ద్విచక్ర వాహనం తో ఎదురుగా అతివేగంగా, నిరక్ష ్యంగా నడుపుకుంటూ వచ్చి వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పురాణం లస్మక్క చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందగా, మోతే పోషవ్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మార్చి 31న కన్నుమూసింది. ఈ ఘటనపై పురాణం సంజీవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ ఐ కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అతివేగం, నిరక్ష ్యపు డ్రైవింగ్ కారణంగా కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ధర్మపురి వార్త

## రైతులు సేంద్రియ సాగుకు ముందుకు రావాలి

-మండల వ్యవసాయ అధికారి అక్షిత

బుగ్గారం ప్రభాతవార్త



వ్యవసాయంలో నేల సారాన్ని పెంచి అధిక దిగుబడులు సాధించేందుకు ఉపయోగపడే పచ్చిరొట్ట ఎరువులు బుగ్గారం మండలంలోని ఆగ్రోస్, డీసీఎంఎస్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని బుగ్గారం వ్యవసాయ అధికారి అక్షిత తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని ఆమె సూచించారు. పచ్చిరొట్ట ఎరువులుగా ఉపయోగించే జీలుగు విత్తనాలు ప్రస్తుతం కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, వీటి ధర రూ. 2452.50 గా నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతులు ముందుగానే విత్తనాలను తీసుకుని వర్షాకాల సాగుకు సిద్ధం కావాలని కోరారు. జీలుగు వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి భూమిలో కలపడం వల్ల నేలలో సేంద్రియ పదార్థాలు పెరిగి, నత్రజని శాతం అధికమవుతుందని తెలిపారు. దీంతో భూమి ఆరోగ్యం మెరుగుపడి రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్క రాజవ్వ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సా గౌడ్, ఆగ్రోస్ ప్రతినిధి ప్రవీణ్ కుమార్, జంగ శ్రీనివాస్, సీఆర్పీలు రమ్య, స్వరూప, ఏవో అక్షి త, ఏఈఓ నవీద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి పట్టణంలో లాడ్జిను సీజ్ చేసిన అధికారులు



ధర్మపురి, ప్రభాతవార్త:

సరైన అనుమతులు లేకపోవడంతో పాటు నిబంధనలు పాటించకుండా గత కొంత కాలంగా ధర్మపురి పట్టణంలో నిర్వహిస్తున్న విజయలక్షి ్మ లాడ్జ్ ను స్థానిక మున్సిపల్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ధర్మపురి ఎస్సై మహేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మపురి పట్ట ణంలో విజయలక్షి ్మ గెస్ట్ హౌస్ ట్రేడ్ లైసెన్స్ లేకపోవడంతో పాటు లాడ్జ్ నిర్వహణకు సంబంధించి నిబంధనలను పాటించకపోవడం లేదు. దాంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ రాం నర్సింహారెడ్డి నిబంధనలు పాటించని ఇట్టి గెస్ట్ హౌస్ పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కు వివరించారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి తమ సిబ్బందితో కలిసి విజయలక్షి ్మ గెస్ట్ హౌస్ ను సీజ్ చేశారు. అలాగే కమర్షియల్ భవనంలో గృహ నిర్మాణానికి సంబంధించి విద్యుత్ మీటర్లు వినియోగిస్తుండగా, దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా విద్యుత్ శాఖ అధికారులకు సైతం వివరించడం జరిగిందని తెలిపారు. గెస్ట్ హౌస్ లు నిర్వహిస్తున్న నిర్వాహకులు తప్పనిసరిగా గదులు అద్దెకు తీసుకునే వారి పూర్తి వివరాలు, గుర్తింపు కార్డులు సేకరించాలని సూచించారు. నిబంధనలు పాటించని గెస్ట్ హౌస్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కాగా ఇటీవల కరీంనగర్ లోని నగలు షాప్ లో చోరీకి పాల్పడిన నిందితులు చోరీకి ముందు మున్సిపల్ అధికారులు సీజ్ చేసిన విజయలక్షి ్మ లాడ్జ్ లోనే బస చేసిన విషయం తెలిసింది.

## బిఆర్ఎస్ నేతలు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

-జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్

ధర్మపురి, ప్రభాతవార్త

వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో బి ఆర్ ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ అన్నారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ పాలనలో వరి ధాన్యం కొనుగోళ్లలో క్వింటాలుకు 5 నుండి 8 కిలోలు వరకు కట్ చేశారని ఆరోపించారు. రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక



చొరవ తీసుకొని మార్కెట్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు యాసంగి సీజన్ లో 2,41,505 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ఈ సంవత్సరం రబీ సీజన్ లో ఇప్పటి వరకే 2,60,868 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు వివరించారు. బి ఆర్ ఎస్ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింహులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# మక్కజొన్న రైతుల రక్తాన్ని పీల్చుక తాగుతున్నారు

- 20రోజులుగా మార్కెట్‌లో పడిగాపులు..
- మార్క్‌ఫెడ్ కొనుగోళ్ల ముసుగులో..

స్థానిక దళారుల దందా..?

- వేలాది క్వింటాళ్లు ప్రైవేట్ గోదాంలకు మళ్లింపు..

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:

రాష్ట్రంలో ఎద్దుఎడ్చిన వ్యవసాయం.. రైతు ఎడ్చిన రాజ్యం.. చరిత్రలో







సుభిక్షంగా.. సుఖసంతోషాలతో ఉన్నట్లు ఎక్కడ కనిపించదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఎన్ని ప్రజాసంక్షేమ రంగాలు బాగుపడ్డాయో... తెలియదు కానీ, నాటి నుండి నేటి వరకు దళారుల దోపిడి నుండి రైతాంగాన్ని కాపాడిన రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత వరకు రాలేదని రైతులు కంటతడిపెడుతున్న సంఘటనలు 20రోజులుగా కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో మండుటెండల్లో.. ఆకలిదప్పులకు ఓర్చుకుని అలమటిస్తున్న రైతుల కన్నీటి గాథలు పాలక ప్రభుత్వాలు పట్టించుకున్నపాపాన పోలేదంటూ రైతులు మంగళవారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ కన్నీంటి పర్యాంతమయ్యారు. గత ఖరీఫ్ సీజన్‌లో అతివృష్టి, అనావృష్టిల వల్ల పత్తి పంటలు అధిక శాతంలో నష్టపోవడంతో రైతాంగం ఆలస్యంగా చెరువులు, కుంటలు నిండి బావులకు నీరు సమృద్ధిగా రావడంతో జనవరి నాటికి పత్తి పంటలను తీసివేసి మక్కజొన్న పంటలను రాష్ట్ర వ్యవసాయ శాఖ వేసిన అంచనాలకు మించి మక్కజొన్న పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేయడంతో పెద్ద మొత్తంలో దిగుబడి వచ్చింది. పత్తిపంట నష్టపోయినప్పటికి మక్కజొన్న పంట రాబడితో గట్టెక్కుదామనుకున్న రైతాంగానికి గత 20రోజులుగా అశలు నీరుకారిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆశయం గొప్పదే అయినప్పటికి మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా నేరుగా క్వింటాల్‌కు 2400రూపాయలు చెల్లించి, మక్కజొన్నలు కొనుగోలు చేసి నేరుగా రైతు బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు వేస్తామన్న శతకోటి ఉపయాలకు కరీంనగర్ పాత జిల్లా వ్యాప్తంగా అనంతకోటి దరిద్రం వెంబడించి, మార్కెట్ యార్డులకు మక్కజొన్నలు తీసుకువచ్చిన రైతాంగాన్ని తేమ ఉందన్న సాకుతో నాలుగు రోజులు ఆరబెట్టడం, గన్ని సంచుల కొరతతో మరో వారం రోజులు గడపడం.. తూకాలు వేయడానికి హామాలీ కార్మికులు లేరంటూ మరో వారం రోజులు గడపడంతో రైతులు మండుతున్న ఎండల్లో విసిగివేసారిపోతున్నారు. అడుగడుగున మార్కెట్ యార్డుకు వచ్చిన రైతాంగాన్ని రోజుల తరబడి కొనుగోళ్లలో తత్సారం చేసి మానసికంగా కృంగతీసి జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో వందలాది కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టే ఖరీదుదారుల చేతుల్లో ఉన్న అడ్తిదారులు మార్క్‌ఫెడ్ అధికారులతో కుమ్మక్కై క్వింటాకు 2400 ధర చెల్లించి కొనుగోలు చేయవల్సిన మక్కజొన్నలను మార్కెట్‌లో బ్రోకర్లు, కొంత మంది అడ్తిదారులు ఖరీదుదారులు అందజేసే కొట్లాది రూపాయలు చేతపట్టుకుని క్వింటాకు 1800 నుండి 1900 రూపాయల వరకు చెల్లించి ఇప్పటికి వేలాది క్వింటాళ్ల మక్కజొన్నలను హుజురాబాద్ పాతతాలుకా పరిధిలోని ప్రైవేట్ గోదాంలోకి తరలించుకుని దళారులు, పెట్టుబడిదారులు, అధికారులు వంద కోట్లకు పైగా రైతుల సొమ్మును దోచుకున్నారు. రైతుల నుండి కొనుగోలు చేసినట్లుగా వారి భూమి పట్టాదారు పాస్‌బుక్‌లు, బ్యాంకు పాస్‌బుక్‌లు, వారి సంతకాలు, వేలిముద్రలు తీసుకుంటూ అందినంతగా దోచుకుంటున్నారని మార్కెట్‌కు వచ్చిన 20రోజులుగా పడిగాపులు కాస్తున్న ఇల్లందకుంట మండలం మర్రివానిపల్లి గ్రామానికి చెందిన రైతులు కోమల, సుజాత, రాంరెడ్డి అనే రైతులు కంటనీరుపెట్టారు. ఇంత జరుగుతున్న అధికార యంత్రాంగం పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

## క్వింటా మక్కజొన్నలకు వంద రూపాయల ఖర్చు.. రైతు నిలువుదోపిడి..

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు మక్కజొన్నలు అమ్ముకోవడానికి వచ్చిన రైతులు 20రోజులుగా అష్టకష్టాలు పడుతూ, ఆకలిదప్పులతో అలమటిస్తు తెచ్చిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి పడరాని పాట్లు పడుతున్న ఈ మార్కెట్‌లో కనుకరించిన నాథుడే కరువయ్యాడు. గన్ని సంచుల్లో 50కిలోల జొన్నలు నింపి, కుట్టువేసి లారీ లోడింగ్ చేసి ఇక్కడి నుండి ఒక్కబస్తాకు నిన్న మొన్నటి వరకు రాష్ట్రప్రభుత్వం రెండు కిలోమీటర్ల దూరంలో గోదాంకు తరలించడానికి 7-8 రూపాయలు చెల్లించగా, గత వారం రోజులుగా ఒక్క బస్తా తరలించడానికి లారీల యజమానులు 15-20 రూపాయల వరకు బేషరతుగా వసూలు చేయడంతో రైతులకు మార్కెట్‌లో అన్ని రకాల ఖర్చులు బరించడానికి క్వింటాకు వంద రూపాయల పైచిలుకు ఖర్చు వస్తుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సోమవారం మూడు రోజుల పాటు జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్ గోదాంల వద్ద పడిగాపులు కాసిన మహిళ రైతులు ఎట్టకేలకు 2759 నెంబర్ గల లారీని డ్రైవర్‌ను కాళ్ల, వేళ్ల పడి మంగళవారం ఉదయం కొత్త మార్కెట్ యార్డు వద్దకు తీసుకువచ్చారు. అక్కడికి వచ్చిన తర్వాత అక్కడున్న అడ్తిదారులు కొందరు వారాల తరబడి నిరాశ చెంది ఉన్న రైతుల వద్ద 1800 రూపాయలకు క్వింటా చొప్పున మక్కలు కొనుగోలు చేసి, రైతుల సంతకాలు తీసుకుని లారీ లోడ్ చేసుకుని లారీ తెచ్చుకున్న మహిళ రైతుల నోర్లు కొట్టి ప్రైవేట్ దళారులు లారీని తరలించుకుపోవడంతో మహిళ రైతులు ఎదురుతిరిగారు. పత్రిక విలేకరులతో మొరపెట్టుకున్నారు. దీనితో సంబంధించిన లారీలను మార్కెట్ గేటు వద్ద ఆపివేసారు. ఎక్కడ చూసిన మార్కెట్ యార్డులో ఎండలో సొమ్మసిల్లిపోయి, ఎక్కడ నిల్వ నీడ దొరికితే అక్కడనే రైతులు నిద్రిస్తున్న దృశ్యాలు మార్కెట్‌లో కొకొల్లలు.

## తెల్లబట్టలు ఉన్నోళ్లకు సంచులు ఇత్తాళ్లు.. నల్లగున్నోళ్లకు ఇత్తలేరు.. రైతుల భావోద్వేగం..

సారు మేము మార్కెట్‌కు వచ్చి 15రోజులైతాంది. మా కండ్ల ముంగట నిన్న గాక, మొన్న వచ్చిన జర తెల్లబట్టలు ఉన్నోళ్లకు పైరవీలు చేసుకున్నోళ్లకు నాయకుల సుట్టాలకు, బంధువులకు ఎనుకచ్చినోళ్లకు వందలాది గన్ని సంచులు ఇచ్చిళ్లు.. ఇంత వరకు ఒక్క సంచి ఇయ్యలేదు. మేము చేసిన పాపమేంది..? అంటూ రైతులు మీడియాతో మొరపెట్టుకున్నారు. కొంటనంటే ఇక్కడిదాక వచ్చినం. ఎండల పడిసత్తానం.. చేతుల పైసలేదు.. బువ్వ తినడానికి అడ్తిదారులను అప్పు అడ్డుకుంటానం.. ఇప్పటికైన చెప్పండి సారు.. కొంటనంటే ఉంటం.. లేకుంటే ఎళ్లిపోతం అంటూ రైతులు అవేదన వ్యక్తం చేసారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో ఇంత జరుగుతున్న రైతుల కష్టాలను పట్టించుకున్న జిల్లా అధికార యంత్రాంగం గానీ, పాలకులు గానీ లేరని రైతులు వాపోతున్నారు. మేము తెచ్చన జొన్నలు మార్క్‌ఫెడ్ అధికారులు దళారులకు అమ్ముకునే విధంగా మమ్ముల మా ఓపికను పరిక్షిస్తున్నారని, ఇలాంటి దుర్భర పరిస్థితులు మేము ఏనాడు చూడలేదని రైతులు జిల్లా అధికార యంత్రాంగంపై నిప్పులు చెరుగుతున్నారు.

## పాపం పోలీసుల పాట్లు..

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రంలో ఇబ్బడి ముబ్బడిగా వచ్చిన ధాన్యం నిల్వలతో గన్ని సంచుల కొరత, లారీల కొరత, హామాలీ కొరత, అధికారుల పట్టింపులేని తనం వల్ల ఎక్కడ పరిస్థితులు చేజారిపోతాయో..? రైతులు ఎక్కడ గొడవలకు దిగుతారు అన్న భయంతో ఒకటిమాత్రం చేసిర్రు.. హుజురాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ వాసంశెట్టి మాధవి ఆదేశాలతో జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణగౌడ్ అధ్వర్యంలో హుజురాబద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన సిబ్బందిని ముందస్తుగా స్టేషన్‌కు నలుగురు సిబ్బందిని పిలిపించుకుని మార్కెట్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రత చర్యలు చేపట్టి, ఉదయం 6గంటల నుండి మద్యాహ్నం 4గంటల వరకు సిఐ రామకృష్ణగౌడ్ తన సిబ్బందితో మార్కెట్ యార్డు వద్ద పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టడం వల్ల ఇంతవరకు పరిస్థితులు చేజారిపోలేదు.. ఏదిఎమైనప్పటికి అన్నదాతలు అన్న పదాన్ని ఉచ్చరించే ప్రతి పౌరుడు రైతుల కోసం రైతు పడ్డ శ్రమకోసం అందరు చేయుతనిచ్చి పాలకప్రభుత్వం, అధికార యంత్రాంగం రైతులను ఆదుకుంటారని ఆశిద్దాం..

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- వచ్చే ఖరీఫ్ నాటికి మొక్కల సరఫరా, డ్రిప్ పనులు పూర్తి చేయాలి

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు ఉద్యాన శాఖ లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీలో ఉద్యాన శాఖ, ఆయిల్ పామ్ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 2026..27 సంవత్సరానికి జిల్లాకు 1150 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యం నిర్దేశించామని ఇప్పటివరకు 370 ఎకరాలకు రైతులు ముందుకు వచ్చి డీడీలు చెల్లించారని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి డీడీలు సేకరించడంతో పాటు మొక్కల సరఫరా, డ్రిప్ ఇరిగేషన్ పనులు వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖలో అమలవుతున్న ఇతర పథకాల లక్ష్యాలను కూడా సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కూరగాయలు, పండ్ల తోటల సాగును ప్రోత్సహించి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిహెచ్ఎస్‌వో జగన్మోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీ ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కుటుంబాలకు వయోసడలింపు వరం

## -ప్రభుత్వ కొలువులకు 44 ఏళ్ల వరకు అవకాశం

గోదావరిఖని, ప్రభాతవార్త:

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ కొలువుల గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచిన నిర్ణయం సింగరేణి కార్మిక కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతోంది. ముఖ్యంగా వయస్సు కారణంగా గతంలో అవకాశాలు కోల్పోయిన వేలాది మంది అభ్యర్థులకు ఈ నిర్ణయం ఊరటనిచ్చేలా మారింది. ఇప్పటివరకు వయోపరిమితి ముగిసిపోయిందని భావించి కొలువుల పోటీలకు దూరమైన వారు ఇప్పుడు మళ్లీ సిద్ధమవుతున్నారు. బొగ్గుగనుల ప్రాంతాల్లో ఇప్పటికే ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడంతో ప్రభుత్వ కొలువులపైనే ఎక్కువ మంది ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం సాధారణ వర్గాల అభ్యర్థులకు 44 ఏళ్ల వరకు అవకాశం ఉండగా, వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా బలహీన వర్గాలకు అదనంగా ఐదేళ్ల సడలింపు వర్తించనుంది. దీంతో ఈ వర్గాలకు చెందిన సింగరేణి కుటుంబాల అభ్యర్థులు 49 ఏళ్ల వరకు కొలువుల కోసం పోటీ పడే అవకాశం పొందుతున్నారు. కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందులు, సరైన మార్గదర్శకం లేకపోవడం వల్ల చదువు పూర్తయ్యాక ఆలస్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఉద్యోగార్థులు చెబుతున్నారు.అయితే ఈ వయోసడలింపు అన్ని శాఖలకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. పోలీస్, మద్యనిషేధ శాఖ, అగ్నిమాపక శాఖ, కారాగార శాఖల వంటి యూనిఫాం సేవల్లో పాత వయోపరిమితులే కొనసాగనున్నాయి. దీంతో ఆ శాఖల్లో కొలువుల కోసం సిద్ధమవుతున్న యువతకు ఈ నిర్ణయం ఉపయోగపడదు. సింగరేణి ప్రాంతాల్లో చాలామంది యువకులు పోలీస్ కొలువులపైనే ఆశలు పెట్టుకోవడంతో వారికి నిరాశ తప్పడం లేదు.వయోపరిమితి పెంపుతో గతంలో అర్హత కోల్పోయిన అభ్యర్థులంతా మళ్లీ పోటీలోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో కొలువుల కోసం పోటీ మరింత తీవ్రంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రతి నోటిఫికేషన్‌కు లక్షల్లో దరఖాస్తులు వస్తుండగా, ఇప్పుడు అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ఈ నిర్ణయం సింగరేణి సంస్థలోని కారుణ్య నియామకాలు లేదా సంస్థ అంతర్గత నియామకాలపై ప్రభావం చూపదని అధికారులు పేర్కొంటున్నారు. సంస్థ నిబంధనల ప్రకారమే అక్కడ వయోపరిమితి అమలులో ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.సింగరేణిలో కొత్త నియామకాలు తగ్గిపోవడం, కారుణ్య నియామకాల ప్రక్రియ ఆలస్యం కావడం, ప్రైవేటీకరణపై చర్చలు సాగుతుండడంతో యువత ప్రభుత్వ కొలువులవైపు ఎక్కువగా మొగ్గుచూపుతోంది. ఇప్పుడు వయోపరిమితి పెంపుతో మరోసారి పోటీ పరీక్షలపై ఆసక్తి పెరిగింది. బొగ్గుగనుల ప్రాంతాల్లో చదువుకున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం త్వరగా ఖాళీల భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తే వేలాది కుటుంబాలకు మేలు జరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## నేడు బండపల్లి కి ప్రభుత్వ విప్

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటిస్తున్నట్లు గ్రామ సర్పంచి కటుకం మల్లేశం తెలిపారు, గ్రామంలో ఉపాధి హామీ నిధులు 22 లక్షల రూపాయలతో నిర్మించే గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు, అలాగే తిమ్మాపూర్ గ్రామంలో సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మండలం నర్సింగపూర్ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని మంగళవారం విద్యుత్ శాఖ ఎస్ఈ వేణు మాధవ్ పరిశీలించారు, అలాగే లింగంపేట గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం స్థల వివరాలను తాహసిల్దార్ భూపతి ని అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో డిఈ గంగాధర్, ఏఈ మహేష్ నర్సింగాపూర్ సర్పంచ్ మరాటి మల్లిక్ ఉన్నారు.

## ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి

పెద్దబొంకూర్, పూసాల రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



జిల్లాలో రైతులు విక్రయిస్తున్న ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అన్‌లోడింగ్ చేసి నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రైస్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లోని రాఘవేంద్ర రైస్ మిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాటా ్లడుతూ,ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా అన్‌లోడింగ్ చేసి నిల్వ చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం దిగుమతులను వేగవంతంగా నిర్వహించాలని తెలిపారు. ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమన్నారు.ఈ సందర్భంగా రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలు, అన్‌లోడింగ్ పరిస్థితులు, వాహనాల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత నిర్వాహకులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ పర్యటనలో పౌర సరఫరా సిబ్బంది మహేష్ , రవీందర్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు .

## పెన్షన్ దారులు ప్రత్యక్ష ధ్రువీకరించుకోవాలి

ఓదెల, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య, చేనేత, వితంతువు, వికలాంగులు, కల్లు గీతా కార్మికుల, ఒంటరి మహిళ, పింఛన్లు అందుకునే వారికి ప్రత్యక్ష ధ్రువీకరణ కార్యక్రమం ప్రతి గ్రామపంచాయతీలలో నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగా మండలంలోని ఓదెల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న 1242 మంది అన్ని రకాల పెన్షన్ దారులకు గ్రామపంచాయతీ ఆవరణలో లైవ్ అథెంటికేషన్ ప్రత్యక్ష ధ్రువీకరణ ఫోటోతీసి పేరు ఆధార్ కార్డు నెంబర్ సమర్పించాలని సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని పెన్షన్ తీసుకునేవారు తప్పకుండా గ్రామపంచాయతీ వచ్చి వారి ఆధార్ కార్డు ఫోటోను ధ్రువీకరించుకోవాలని ప్రతి పింఛన్దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ అన్నారు



## ఐటీఐ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ వర్చువల్ మీటింగ్ విజయవంతం

జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎ.సురేష్

హాజరైన 255 మందికి పైగా విద్యార్థులు

పెద్దపల్లి, ప్రభాతవార్త:



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ వర్చువల్ మీటింగ్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయినట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎ. సురేష్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్చువల్ మీటింగ్ కార్యక్రమానికి కళాశాల నుండి 255 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారని, ?ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవసరమైన వివిధ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ కోర్సుల గురించి పూర్తి అవగాహన కల్పించారు. వీటితో పాటు దేశ సేవలో భాగస్వామ్యం అయ్యేందుకు వీలుగా అగ్నివీర్ నియామకాలు, ఆర్మ్డ్ ఫోర్సెస్, పారా మిలిటరీ ఫోర్సెస్‌లో ఉన్న విభిన్న కెరీర్ అవకాశాలు, ఉద్యోగాల గురించి విద్యార్థులకు సవివరంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, వైస్ ప్రిన్సిపాల్, ట్రైనింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లిరోజును సేవా దినంగా జరుపుకున్న దంపతులు

గోదావరిఖని, ప్రభాత వార్త:.



పెళ్లిరోజు వేడుకను ఆర్భాటాలకు దూరంగా సేవా కార్యక్రమంగా నిర్వహిస్తూ ఓ దంపతులు మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణానికి చెందిన రిటైర్డ్ గెజిటెడ్ హెడ్మాస్టర్ అప్పపురం లక్ష్మయ్య-చంద్రకళ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పోచమ్మ గుడి ఆవరణలో నిరాశ్రయులు, అవసరమైన వారికి అన్నప్రసాద వితరణ చేపట్టారు.కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేసిన దంపతులు ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య మనవళ్లు నిట్టూరి శేఖర్, దుబ్బాక విజ్ఞాన్ బాబు, సిల్వెస్టర్ జాయ్, సుందిళ్ల అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పచ్చి రొట్టె ఎరువుల పంపిణీ

మండల వ్యవసాయ అధికారి డి. నాగార్జున

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:

రైతులకు పచ్చి రొట్టె ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి డి. నాగార్జున అన్నారు. బుధవారం పెద్దపల్లి మండలంలోని గ్రామ సర్పంచులు అందరికీ ఆయన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నేడు ఉదయం 10 గంటలకు ప్రభుత్వ విప్,గ పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయ రమణ రావు చేతుల మీదుగా బస్ స్టాండ్ ఆవరణలో గల డీసీఎంఎస్ నందు పచ్చి రొట్టె ఎరువులు అయిన జీలుగా పంపిణీ చేపట్టనున్నట్లు, ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు అందరూ తప్పకుండా హాజరు కావాలని మండల వ్యవసాయ అధికారి డి.నాగార్జున కోరారు.

## దళితులను అడ్డుకున్న నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

బాధితులకు రక్షణతో ఆలయ ప్రవేశం కల్పించాలి

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి అశోక్

పెద్దపల్లి, ప్రభాతవార్త:




దళితులను అడ్డుకున్న నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెగడపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా దళిత సమాజానికి చెందిన భక్తులను గుడిలోకి రాకుండా అడ్డుకోవడం, వారి పట్ల వివక్ష చూపడం అత్యంత విచారకరం మరియు అమానుషం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధునిక సమాజంలో ఇంకా ఇలాంటి కుల వివక్షా పూరిత సంఘటనలు జరగడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు అని పేర్కొన్నారు. భగవంతుని ముందు అందరూ సమానులే అనే భావనను తుంగలో తొక్కి, కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా దళితులను ఆలయ ప్రవేశం చేయకుండా నిరోధించడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం అస్పృశ్యత ముమ్మాటికీ నేరమని గుర్తుచేశారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) తరఫున దళిత భక్తులను ఆలయంలోకి రాకుండా అడ్డుకున్న నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులైన దళిత కుటుంబాలకు పోలీసు రక్షణతో ఆలయ ప్రవేశం కల్పించి, గౌరవప్రదంగా అమ్మవారి దర్శనం చేయించాలని కోరారు. ఈ ఘటనపై రెవెన్యూ మరియు పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ జరపాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుల రహిత సమాజం కోసం పోరాడే ప్రతి ఒక్కరూ ఈ వివక్షను ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. బాధితులకు న్యాయం జరిగే వరకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు సిపెల్లి రవీందర్, మోదంపల్లి శ్రావణ్, సాతూరి అనిల్, కొంగటి లింగమూర్తి, మామిడిపల్లి బాపయ్య, అంబాల రాజేందర్, కుమ్మరి నవీన్, కుక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## లేఅవుట్ క్రమబద్ధీకరణకు 25 శాతం రాయితీ.

ప్లాట్ల యజమానులకు ప్రభుత్వం మరో అవకాశం

జూలై 31లోగా ఫీజు చెల్లిస్తేనే వర్తింపు

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్2020) కింద పెండింగ్‌లో ఉన్న ఫీజుల చెల్లింపుపై 25 శాతం రాయితీ కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి. రమేష్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్లాట్ల యజమానులకు మరో అరుదైన అవకాశాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిం దన్నారు.ఎల్ఆర్ఎస్ 2020 కింద ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్లాట్ యజమానులు 2026 మే 1 నుంచి జూలై 31 వరకు మూడు నెలల గడువులోగా ఫీజులు చెల్లిస్తే 25 శాతం రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్లాట్ల యజమానులు తమ ఆస్తులను క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ప్రజలకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు.లేఅవుట్ క్రమబద్ధీకరణ ద్వారా భవిష్యత్తులో ఆస్తుల కొనుగోలు, విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాల వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ రాయితీ గడువును ప్లాట్ల యజమానులు తప్పకుండా వినియోగించుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు.

## గ్రామీణ ఉపాధి కల్పనలో సుల్తానాబాద్ ముందంజ

ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు

315 మంది కూలీల సమీకరణతో ఫీల్డ్ అసిస్టెంట్

రమేష్‌కు సన్మానం

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో పెద్దపల్లి జిల్లాలో సుల్తానాబాద్ మండలం మొదటి స్థానంలో నిలిచిందని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. గ్రామానికి సగటున 138 మంది కూలీలతో పనులు నిర్వహిస్తూ మండలం జిల్లాలో అగ్రస్థానంలో నిలవడం ఆనందదాయకమన్నారు. మండల వ్యాప్తంగా ప్రస్తుతం 3,700 మంది కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో 315 మంది కూలీలను సమీకరించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన రేగడి మద్దికుంట గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్‌ను ఘనంగా సన్మానించారు. అలాగే 200 మందికి పైగా కూలీలు పనిచేస్తున్న గ్రామాల క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులను ప్రత్యేకంగా అభినందించారు. కనుకుల గ్రామంలో 285 మంది, చిన్నకల్వలలో 270 మంది, నారాయణపూర్‌లో 250 మంది, గట్టేపల్లిలో 232 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకు మరింత మంది కూలీలను సమీకరించి గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పనుల విజయవంతమైన అమలుకు సహకరిస్తున్న మండలంలోని సర్పంచ్‌లందరికీ ఎంపీడీవో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## జగిత్యాల కేంద్రీయ విద్యాలయానికి చెల్గల్‌లోనే 10 ఎకరాల భూమి కేటాయించాలి

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కి

ఇతర చోట ప్రతిపాదించండి

సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లాలో కేంద్రీయ విద్యాలయం స్థాపన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష ్యంగా వ్యవహరిస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ మాట్లాడుతూ చల్గల్ లోని వాలాంతరీ కి చెందిన గల పది ఎకరాల భూమిని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు కేటాయించారని, ఇట్టి భూమిని కేంద్రీయ విద్యాలయ పేరిట బదలాయింపు చేయాలన్నారు . కేవీఎస్ నిబంధనల ప్రకారం కనీసం 5 ఎకరాల భూమి అవసరం ఉండగా, ప్రభుత్వం కేవలం 2 ఎకరాల భూమిని మాత్రమే ఆమోదించడం దురదృష్టకరమని విమర్శించారు. చెల్గల్ గ్రామంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కోసం 10 ఎకరాల భూమి కేటాయించిన ప్రభుత్వం, కేంద్రీయ విద్యాలయానికి మాత్రం సరైన భూమి ఇవ్వకపోవడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని అన్నారు. నర్సింగపూర్ సమీపంలో ప్రతిపాదించిన స్థలం రహదారి, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో పాటు చెత్త నిల్వ ప్రాంతానికి దగ్గరగా ఉండటం వల్ల విద్యాసంస్థకు పూర్తిగా అనర్హమని పేర్కొన్నారు. అందువల్ల చెల్గల్ గ్రామంలోని 10 ఎకరాల భూమిని వెంటనే కేంద్రీయ విద్యాలయానికి కేటాయించాలని, లేకపోతే జగిత్యాల విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని కోల్పోయే పరిస్థితి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి కి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## రామగుండం మైనింగ్‌కు కొత్త యుగం

పాత గనుల ముగింపు..

మెగా ప్రాజెక్ట్‌తో సింగరేణి భారీ వ్యూహం

25 ఏళ్ల భవిష్యత్‌కు బాటలు..

5,500 మంది కార్మికులకు ఉద్యోగ భరోసా

గోదావరిఖని ,ప్రభాతవార్త:

ఒకప్పుడు దేశంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి కేంద్రాల్లో ఒకటిగా వెలుగొందిన రామగుండం ప్రాంతం ఇప్పుడు మరో కీలక మలుపు దిశగా అడుగులు వేస్తోంది. పాత అండర్‌గ్రౌండ్ గనులు సహజంగానే నిల్వలు తగ్గిపోవడంతో వరుసగా మూతపడుతున్నప్పటికీ, అదే సమయంలో సింగరేణి సంస్థ చేపట్టిన భారీ వ్యూహాత్మక ప్రణాళిక ఈ ప్రాంతానికి కొత్త జీవం పోస్తోంది. "రామగుండం కోల్ మైన్ ప్రాజెక్ట్" పేరుతో రూపొందుతున్న మెగా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నుంచి అనుమతులు రావడంతో సింగరేణి భవిష్యత్‌పై కొత్త ఆశలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏటా 210 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి లక్ష ్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గుముఖం పట్టిన జీడీకే 10 ఇంక్లైన్, వకీల్‌పల్లి అండర్‌గ్రౌండ్ గని, ఆర్జీ ఓసీపీ1 ఎక్స్‌టెన్షన్ పరిధిలోని ప్రాంతాలను ఒకే ప్రాజెక్ట్ కింద విలీనం చేసి ఆధునిక ఓపెన్‌కాస్ట్ గనిగా అభివృద్ధి చేయనున్నారు. ఇది కేవలం మరో గని మాత్రమే కాదు.. రామగుండం ప్రాంత మైనింగ్ చరిత్రలోనే అతిపెద్ద మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు.

### పాత గనులకు గుడ్‌బై..

కొత్త టెక్నాలజీకి వెల్కమ్‌రామగుండం ప్రాంతంలోని పాత గనులు దశాబ్దాలుగా సింగరేణి ఉత్పత్తికి వెన్నెముకలా నిలిచాయి. అయితే కాలక్రమేణా బొగ్గు నిల్వలు తగ్గిపోవడం, లోతైన గనుల్లో ఉత్పత్తి వ్యయం పెరగడం, భద్రతా సమస్యలు తీవ్రతరం కావడంతో అండర్‌గ్రౌండ్ మైనింగ్‌ను కొనసాగించడం కష్టసాధ్యంగా మారింది. దీంతో సింగరేణి సంస్థ సంప్రదాయ పద్ధతులకు బదులుగా భారీ ఓపెన్‌కాస్ట్ మైనింగ్ విధానాన్ని ఎంచుకుంది. కొత్త ప్రాజెక్ట్‌లో ఆధునిక యంత్రాంగం, భారీ ఎక్స్‌కవేటర్లు, హైటెక్ డంపర్లు, డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలను వినియోగించనున్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు వ్యయాన్ని తగ్గించడమే ఈ ప్రణాళిక వెనుక ప్రధాన ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల రామగుండం ఏరియాకు మరో 25 ఏళ్ల ఆయుష్షు లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

### ఉద్యోగ భద్రతపై స్పష్టత

పాత గనులు మూతపడుతున్నాయనే వార్తలతో కార్మికుల్లో కొంతకాలంగా ఆందోళన నెలకొంది. ముఖ్యంగా అండర్‌గ్రౌండ్ గనుల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు తమ భవిష్యత్‌పై అనిశ్చితిలో ఉన్నారు. అయితే తాజా ప్రాజెక్ట్‌తో ఆ సందేహాలకు సింగరేణి యాజమాన్యం చెక్ పెట్టినట్టైంది. ప్రస్తుతం వివిధ గనుల్లో పనిచేస్తున్న సుమారు 5,500 మంది సింగరేణి ఉద్యోగులకు కొత్త ప్రాజెక్ట్‌లోనే ఉపాధి కల్పించనున్నట్లు సమాచారం. అదనంగా దాదాపు 600 మంది కాంట్రాక్ట్ కార్మికులకు కూడా పనులు లభించే అవకాశముందని తెలుస్తోంది. దీంతో రామగుండం ప్రాంత ఆర్థిక వ్యవస్థకు కూడా ఊరట లభించనుంది.

### ఎన్టీపీసీకి బొగ్గు సరఫరా కొనసాగింపు

రామగుండం ప్రాంత మైనింగ్ కార్యకలాపాలకు మరో కీలక కారణం ఎన్టీపీసీ థర్మల్ విద్యుత్ కేంద్రం. దశాబ్దాలుగా ఈ విద్యుత్ కేంద్రానికి అవసరమైన బొగ్గు సరఫరాను సింగరేణి నిర్వహిస్తోంది. కొత్త మెగా ప్రాజెక్ట్ అమలులోకి వస్తే బొగ్గు సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో పాత రామగుండంబి థర్మల్ ప్లాంట్ స్థానంలో సూపర్‌క్రిటికల్ సాంకేతికతతో కొత్త విద్యుత్ కేంద్రాన్ని నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి, జెన్‌కో సంయుక్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఈ పరిణామాలు రామగుండాన్ని భవిష్యత్‌లో మరింత కీలక ఇంధన కేంద్రంగా నిలబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### పర్యావరణం.. నిర్వాసితుల అంశం కీలకం

అయితే మెగా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌కు సంబంధించి పర్యావరణ ప్రభావం, గ్రామాల నిర్వాసితుల సమస్యలు కూడా చర్చనీయాంశంగా మారుతున్నాయి. భూసేకరణ, ధూళి కాలుష్యం, భూగర్భ జలాలపై ప్రభావం వంటి అంశాలపై స్థానిక ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సింగరేణి ప్రత్యేక పునరావాస చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయినా మొత్తం మీద చూస్తే, పాత గనుల ముగింపుతో రామగుండం మైనింగ్ చరిత్ర ముగియడం లేదు. ఆధునిక టెక్నాలజీ, భారీ ఉత్పత్తి లక్ష్యాలు, దీర్ఘకాలిక వ్యూహాలతో సింగరేణి రామగుండాన్ని మరోసారి తెలంగాణ ఇంధన రాజధానిగా మలచే దిశగా అడుగులు వేస్తోంది.

## ఏఐ, లైఫ్ స్కిల్స్ పై నాలుగు రోజుల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి

ఈ నెల 27 నుంచి 30 వరకు శిక్షణ,

26 లోపు దరఖాస్తుకు అవకాశం

పెద్దపల్లి, ప్రభాతవార్త:

ఏఐ, లైఫ్ స్కిల్స్ పై నాలుగు రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పెద్దపల్లి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నాలుగు రోజుల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో ఈ నాలుగు రోజుల శిక్షణను మే 27 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు ఉన్న అభ్యర్థులు అర్హులని వివరించారు. అభ్యర్థుల విద్యార్హతలు ఏదైనా ఇంటర్ లేదా డిప్లమా, డిగ్రీ కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26 సాయంత్రం 5 గంటల లోపు పని దినాలలో బీసీ స్టడీ సర్కిల్, కరీంనగర్ కార్యాలయంలో ఆఫ్ లైన్ లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని పెద్దపల్లి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి సూచించారు. దరఖాస్తు సమయంలో స్టడీ సర్టిఫికెట్స్, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ, ఆధార్ కార్డు పత్రాలను, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 08782268686 ను సంప్రదించాలని కోరారు.

## ప్రభుత్వ వైఫల్యం నిరక్ష్యం తోని రైతులు నష్టపోతున్నారు

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి



సారంగాపూర్ ప్రభాతవార్త: ప్రభుత్వ వైఫల్యం నిరక్ష ్యం తోని రైతులు నష్టపోతున్నారు అని మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి పేర్కొన్నారు సారంగాపూర్ మండల కేంద్రంలో పత్రికా సమావేశంలో మంగళవారము మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల పైన ప్రభుత్వం ఆర్ ఆర్ ట్యాక్స్ విధిస్తుందన్నారు నాకున్న అనుభవంలో ఈసారి రైతు ఎదుర్కొంటున్నంత ఇబ్బంది ధాన్యం కానీ మొక్కజొన్న గాని వ్యవసాయ ఉత్పత్తులు ఎన్నడూ కూడా ఇటువంటి పరిస్థితి ఎదురు అయినట్టు గమనించిన లేదన్నారు ప్రభుత్వం ఏదైనా గత అనుభవంతోని ఏమైనా సమస్యలు ఉన్నాగాని సమస్యలను ఏ విధంగా అధిగమించే విధంగా చర్యలు చేపట్టాలి గత సంవత్సరం అనుభవంతోనే గతం కంటే మెరుగైన రీతిలో దాన్యం సేకరణ కానీ చేపట్టవలసింది గతం కంటే సమస్యలు అధికం కావడం పాలన యంత్రాంగం వైఫల్యం లేదా కుట్రపూరితంగా చేస్తున్నారు అని అనుమానం వ్యక్తం అవుతుందన్నారు వరి ధాన్యం జిల్లా కలెక్టర్ గారు ఇచ్చిన స్టేట్మెంట్ గమనిస్తే ఇంతవరకు రెండు లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాం ఇంకొక మూడు లక్షల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉంది అని స్టేట్మెంట్ ఇచ్చారన్నారు గత సంవత్సరం ఈ సమయానికి మూడు లక్షల 45 వేల మెట్రిక్ టన్నులు సేకరణ జరిగిందన్నారు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం లక్ష 45 వేల మెట్రిక్ టన్నులు తక్కువ సేకరించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ శ్రేణులు రాంచంద్ర రెడ్డి , సత్యం రావు , మాసర్తి రమేష్ , రాజు , ఆకుల రాజిరెడ్డి, పూర్ణచందర్ , ఆకుల రమేష్ వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు .

## బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు క్యూలైన్లలో బోనాలు నెత్తిన పెట్టుకొని భక్తులు బారులు తీరారు. నైవేద్యం వండుకొని బోనం నెత్తిన పెట్టుకొని ఆట పాటలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని భక్తులు బోనాలు సమర్పించుకున్నారు. బద్ది పోచమ్మకు భక్తులు ఒడి బియ్యం, కల్లు శాఖ పెట్టి మొక్కులను తీర్చుకున్నారు. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో క్యూలైన్‌లను ఈఓ రమాదేవి పర్యవేక్షించారు. భక్తుల రద్దీతో బద్ది పోచమ్మ ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి 4గంటల సమయం పట్టింది.

## బయ్యారం పోలీసుల ఆధ్వర్యంలో నాకాబందీ

**బయ్యారం,ప్రభాతవార్త,మే 19.** జిల్లా ఎస్పి డా. శబరిష్ ఆదేశానుసారం మండలంలో అక్రమ రవాణాను అరికట్టడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి గార్ల బయ్యారం సీఐ ఆధ్వర్యంలో ఇల్లందు మహబూబాబాద్ హైవె రోడ్డుపై ఆకస్మిక తనిఖీలలో భాగంగా నాకాబందీ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలను ఆపి విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణ, దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, గంజాయి, ఇతర మత్తుపదార్థాల రవాణాను అడ్డుకోవడానికి నాకాబందీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

**-- వి. ప్రణవ్ బాబు**

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:**



ప్రతిరోజు సమస్యలను వెలికి తీస్తూ... ప్రజల కోసం నిలబడుతున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు అన్నారు. మంగళ వారం హుజురాబాద్ పట్టణంలోని హుజురాబాద్ క్లబ్ లో మీడియా సర్వసభ్య సమావేశం జరిగింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన చిర్ర సుదర్శన్ కుటుంబానికి ప్రమాద బీమా పోస్టల్ బాండ్ ద్వారా వచ్చిన ఇన్సూరెన్స్ బాండ్ ను బాధిత కుటుంబానికి అందజేశారు. హుజురాబాద్ పట్టణంలోని వివిధ పాఠశాలలో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య విషయంలో ముందు ఉంటామని, తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన వారికి రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు కేటాయింపు చేయడం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, ప్రధాన కార్యదర్శి రవీందర్, కౌన్సిలర్లు సొల్లు సునీత, మొగిలి, సమ్మయ్య, జర్నలిస్టులు, నాయకులు పాల్గొన్నారు.

## సిర్సపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:**




కరీంనగర్ లోని మెడికవర్ ఆసుపత్రి వారు గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో మండలంలోని సిర్సపల్లి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు నూట యాభై మంది రోగులకు బిపి, షుగర్, ఈసీజీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి డాక్టర్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించటమే మా ఆసుపత్రి లక్ష్యం అని, ఇరువై నాలుగు గంటల పాటు అన్నీ రకాల వైద్య సదుపాయాలు మా ఆసుపత్రిలో ఉంటాయని, అవసరమైన గ్రామీణ ప్రాంత రోగులను మా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తామని తెలియజేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ పోల్సాని రామారావు మాట్లాడుతూ... మా గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి మా గ్రామ ప్రజలకు ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉన్నదని, ఈ ఆసుపత్రి వైద్య సేవలను మరువబోమని తెలిపి మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో గ్రామ ఉప సర్పంచ్ రాజేష్, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, అబ్దుల్ వకీల్, శ్రీకాంత్, వార్డు మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మొక్కలు నాటిన పిఓ

**ప్రభాతవార్త ఏటూరునాగారం మే 19:**

ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ ఆధ్వర్యంలో జనజాతీయ గరిమ ఉత్సవ్ సందర్భంగా మంగళవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వాత్సల్ టోప్పో, ఐఏఎస్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం పీఎం జనజాతీయ గరిమ ఉత్సవ్ 2026కి సంబంధించిన ప్లాంటేషన్ డ్రైవ్ మరియు హెల్త్ స్క్రీనింగ్ యాక్టివిటీ క్యాంపు మరియు షీ టీమ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (జి) ఐటిడిఎ కె.నాగోరావు, జిల్లా కోఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ జగదీష్, స్టాటిస్టికల్ ఆఫీసర్ / అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఐటిడిఎ ఎం. రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ సిహెచ్‌సి డాక్టర్ ఎం. సురేష్, వైద్య అధికారులు, పోలీసు అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి వేడుకలు

### సుందరయ్య గారి ఆశయాలు నెరవేర్చుదాం... ..

### సీపీఎం పార్టీ జమ్మికుంట టౌన్ కమిటీ...



**జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:** కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పీడిత వర్గాల ప్రజల కోసం నిరంతరం పోరాటాలు చేసిన పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను నెరవేర్చాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం జమ్మికుంట టౌన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సిపిఎం ఆఫీసులో సుందరయ్య 41వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టౌన్ కార్యదర్శి దండిగారి సతీష్ మాట్లాడుతూ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ రూపకర్తల్లో ఒకరైన సుందరయ్య 1936వ సం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లాలో భూస్వామ్య కుటుంబంలో జన్మించి భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి కార్మికుల కోసం పేద ప్రజల హక్కుల కోసం పోరాడినటువంటి ఘనత సుందరయ్య దని అన్నారు. దేశంలో అత్యున్నతమైనటువంటి పార్లమెంటుకు రాజ్యసభలో ప్రతిపక్ష హోదాలో సైకిల్ పై వెళ్ళినటువంటి ఘనత సుందరయ్య దేనని సుందరయ్య ఆయనకు ఉన్నటువంటి 120 ఎకరాల భూమిని భూమి లేని పేద ప్రజలకు భూ పంపిణీ చేసిన వ్యక్తి సుందరయ్య అని పేర్కొన్నారు.ఆయన జీవితాంతం ప్రజల హక్కుల కోసం పోరాడి చివరి శ్వాస వరకు కూడా సిపిఎం పార్టీ విధానాలకు కట్టుబడి పని చేసినటువంటి సుందరయ్య 1985 మే 19వ తేదీన మరణించడం జరిగిందన్నారు. నేటికీ చనిపోయి 41 సంవత్సరాలు అవుతుందని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్మికులు, రైతులు. దళిత బడుగు బలహీన వర్గాలు పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్ ,జక్కుల రమేష్ యాదవ్. నాయకులు మారపల్లి కిరణ్, మధునయ్య,పోచయ్య, చేరాలు,కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ బోర్డ్ వరద కాలువ సమస్య పరిష్కరించాలంటు.. ఒడితల ప్రణవ్ కు వినతి పత్రం..

**జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త :**



జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో వరద కాలువ నిర్మాణం చేయకపోవడం వల్ల వర్షాకాలంలో హౌసింగ్ బోర్డ్ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వరద కాల్వ నిర్మాణం చేపట్టాలని బీజేపీ నాయకులు నజీరోద్దీన్ మంగళవారం హుజూరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నజీరోద్దీన్ హౌసింగ్ బోర్డు సమస్యలపై ప్రణవ్ తో మాట్లాడుతూ వర్షాలు పడితే కాలనీవాసులు భయం భయంగా బతికే పరిస్థితి ఉందని, వరద కాలువ లేకపోవడం వల్ల వర్షాలు పడితే ఇండ్లలోకి నీరు చేరి నిత్యవసర వస్తువులు పూర్తిగా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరద వస్తే కట్టుబట్టలతో ఇండ్ల నుండి బయటకు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు వర్షాలు వచ్చిన ప్రతిసారి ప్రజా ప్రతినిధులు అధికారులు వరద కాలువ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చి వెళ్తున్నారని, అధికారులు పనులు చేయడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. తమరు వరద కాలువ పనులకు నిధులు మంజూరు చేయించాలని కోరారు హౌసింగ్ బోర్డ్ ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని వరద కాలువ పనులు అయ్యేలా అధికారులకు సూచనలు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు బిజెపి నాయకులు నసీరోద్దీన్ తెలిపారు.

## రైతన్నను అరిగోస పెడుతున్న ప్రభుత్వం

**-- బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్**

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:**



రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా అరిగోస పెడుతుందని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హుజురాబాద్ లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. పండించిన పంటకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వం కనీసం పండించిన పంటను కూడా కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్లాల మీదే ధాన్యం కొనుగోలు చేసేవారని అన్నారు. ప్రైవేట్ వ్యక్తులు కొంత మేరకు కొనుగోలు చేసినప్పటికీ ఒక్కో బస్తా మీద నాలుగు నుంచి ఐదు కిలోల తరుగు తీస్తున్నారని, ధాన్యం కూడా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అలసత్వం చూపడంతో చాలా మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, కొంత మంది రైతులు ఆత్మహత్యకు కూడా పాల్పడుతున్నారని అన్నారు. ఎద్దు ఏడ్చిన యవసం... రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదని సత్యాన్ని గ్రహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి వెంటనే రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని లేని పక్షంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలి

**హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:**



రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలని కరీంనగర్ తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ కె. మదన్ మోహన్ రెడ్డి లు సూచించారు. మంగళవారం మండలం సింగాపూర్ గ్రామంలో యూరియా వినియోగం, సేంద్రీయ వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు వివిధ పంటల సాగు పద్ధతులు, నేల ఆరోగ్యం మెరుగుపరచడం, సేంద్రీయ ఎరువుల వినియోగం వంటి అంశాలపై వివరించారు. రైతులు నిరంతరం ఒకే పంట వేయడం వల్ల నేలలో పోషకాలు తగ్గిపోతాయని, పంట మార్పిడి ద్వారా ఆ లోటును భర్తీ చేయవచ్చని తెలిపారు. పంటల ఎంపికలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు, హుజురాబాద్ గూండా సునీత మాట్లాడుతూ... రైతులు రసాయన ఎరువులు, ముఖ్యంగా యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతిలో పంటలను పండించాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి భూమారెడ్డి మాట్లాడుతూ... రైతులందరూ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని, వరికి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నారాయణ రెడ్డి, వ్యవసాయ ఉత్పత్తి దారుల సంస్థ, చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, ఏఈఓ సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

## రేవంతన్న అభయహస్తం జీవిత భీమా ప్రారంభం

**మంగపేట మే19, ప్రభాతవార్త.** తెలంగాణ రాష్ట్రం లోని ప్రతి ఇంటికీ రూపాయలు 5లక్షల ఇందిరమ్మ బీమా ధీమా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో మన ములుగు ఆడబిడ్డ మంత్రి సీతక్క అక్క చొరవతోజూన్ 2 నుంచి సార్వత్రిక జీవిత బీమా ప్రారంభం అవుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబానికి రూపాయలు5 లక్షల జీవిత బీమా సౌకర్యం ఉచితం కుటుంబ పెద్దకు ఏమైనా జరిగితే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా బీ ఆర్ ఎస్ హయాంలో బీమా లేదు, భరోసా లేదు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో ప్రతి ఇంటికి రూపాయలు5 లక్షల ధీమా జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవం పేదోడి జీవితంలో కొత్త వెలుగు..నింపుతుంది.